# బలగం TV BALAGAM

నిజమే మా బలం.. ప్రజలే మా బలగం

BALAGAM TV DIGITAL NEWS PAPER | balagamtv100@gmail.com

హైదరాబాద్ గురువారం 22 ఆగస్టు 2024 | www.balagamtv.com | పేజీలు 4


## ఓటర్ల జాబితా షెడ్యూల్ రిలీజ్




**బలగం టీవీ, హైదరాబాద్ బ్యూరో**

తెలంగాణలో పంచాయతీ ఎన్నికలకు ఎన్నికల సంఘం కసరత్తు చేస్తోంది. ఓటరు జాబితా తయారీకి రాష్ట్ర ఎన్నికల సంఘం బుధవారం షెడ్యూల్‌ను విడుదల చేసింది. సెప్టెంబర్ 6న ఆయా గ్రామపంచాయతీలలో వార్డుల వారీగా డ్రాఫ్ట్ ఓటరు జాబితాను ప్రచురిస్తారు. ఈ జాబితాపై సెప్టెంబర్ 7వ తేదీ నుంచి 13 వరకు అభ్యంతరాలను స్వీకరి స్తారు. సెప్టెంబర్ 9, 10 తేదీలలో రాజకీయ పార్టీల నుంచి సూచనలు, సలహాలను స్వీకరి స్తారు. సెప్టెంబర్ 21న వార్డుల వారీగా తుది జాబితాను ప్రచురిస్తారు. ఈ నెల 29న ఓటరు జాబితా తయారీపై జిల్లాల కలెక్టర్లతో రాష్ట్ర ఎన్నికల ప్రధానాధికారి వీడియో కాన్ఫరెన్స్ నిర్వహిస్తారు.

# ఆర్ఆర్ఆర్ దక్షిణ భాగంలో భూసేకరణ వేగం పెంచండి






- రీజినల్ రింగ్ రోడ్డు పై ఇక రోజువారీ పరిశీలన
- రైతులకు న్యాయం జరిగేలా పారదర్శకత పాటించండి
- భవిష్యత్ అవసరాలకు అనుగుణంగానే అలైన్‌మెంట్ ఉండాలి
- ప్రగతిపై ఉన్నతస్థాయి సమీక్షలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి

**బలగం టీవీ, హైదరాబాద్ బ్యూరో**

తెలంగాణ సమగ్రాభివృద్ధే లక్ష్యంగా చేపట్టిన రీజినల్ రింగ్ రోడ్డు దక్షిణ భాగం భూసేకరణ పనుల్లో వేగం పెంచాలని అధికారులను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆదేశించారు. రీజినల్ రింగ్ రోడ్డుకు సంబంధించి భూసేకరణ పనుల పురోగతిపై ముఖ్యమంత్రి గారు డాక్టర్ బీఆర్ అంబేద్కర్ రాష్ట్ర సచివాలయంలో ఉన్నతస్థాయి సమావేశంలో సమీక్షించారు.భూములిచ్చే రైతులకు న్యాయం చేస్తూ ఆర్ఆర్ఆర్ భూసేకరణ పూర్తి పారదర్శకంగా జరగాలని ముఖ్యమంత్రి ఆదేశించారు. ఆర్ఆర్ఆర్ నిర్మాణ పనుల్లో పురోగతిపై సంబంధిత కలెక్టర్లు ఇకపై రోజూవారిగా ప్రభుత్వ ప్రధాన కార్యదర్శికి వివరించాలని సీఎం పేర్కొన్నారు.

వివరాలు 2వ పేజీలో

## రుణమాఫీపై ఎలాంటి ఆంక్షలు లేవు..

- రుణ మాఫీ పొందని రైతులు దరఖాస్తు చేసుకోవాలి
- రైతుల్లో ఆందోళన పెంచాలని చూస్తున్నారు
- 10 ఏండ్లలో రైతుల గురించి పట్టించుకోలేదు
- నల్ల చట్టాలు తీసుకొచ్చిన పార్టీ కూడా మాట్లాడుతోంది
- వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు



**బలగం టీవీ, ఖమ్మం**

రాష్ట్ర ప్రభుత్వం తీవ్ర అప్పుల్లో ఉన్నా రూ.2లక్షల వరకు రుణమాఫీ చేస్తున్నామని, రుణమాఫీపై ఎలాంటి ఆంక్షలు విధించలేదని వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తెలిపారు. బుధవారం ఖమ్మంలో ఆయన మీడియాతో మాట్లాడారు. ఇప్పటి వరకు 22 లక్షల రైతు ఖాతాల్లో రుణమాఫీ డబ్బులు జమ చేశామని చెప్పారు. ఆధార్, బ్యాంకు ఖాతాల్లో తప్పులున్న వారికి మాత్రమే రుణమాఫీ ఆగిందన్నారు. వాటిని సరిదిద్ది రుణమాఫీ చేయాలని అధికారులను ఆశించామని చెప్పారు. రుణ మాఫీ పొందని రైతులు.. వ్యవసాయాధికారులకు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. రైతు వేదికలు, మండల ఆఫీసుల్లో అధికారులను పెట్టి వివరాలు తీసుకుంటామని తెలిపారు.

రైతుల గురించి ఏమాత్రం పట్టించుకోని, పదేళ్ల పాటు రైతుల్ని మోసం చేసిన పార్టీ ముసలి కన్నీరు కారుస్తోందన్నారు. నల్ల చట్టాలు తెచ్చి రైతులను ఇబ్బంది పెట్టిన పార్టీ కూడా మాట్లాడుతోందని చెప్పారు. అసత్యాలు చెప్పి రైతుల్లో ఆందోళన పెంచాలని చూస్తున్నారన్నారు. బ్యాంకులు, అధికారులు ఏమైనా తప్పు చేస్తే.. వాటిని సరిదిద్దే ప్రక్రియ కొనసాగుతోందని... 41,78, 892 మంది రైతులు రుణాలు తీసుకున్నారని బ్యాంకులు చెప్పాయి. వారి బకాయిలు రూ.31వేల కోట్లు ఉన్నాయి. చిన్న, సన్నకారు రైతులకు ఎక్కువగా రూ.2లక్షలలోపు రుణాలే ఉన్నాయి. రుణమాఫీ విషయంలో రైతులు ఆందోళన చెందకుండా వ్యవసాయ పనులు చూసుకోవాలిలని మంత్రి తుమ్మల విజ్ఞప్తి చేశారు.



## పోలెండ్‌లో ప్రధాని మోడీ..

**బలగం టీవీ, న్యూఢిల్లీ**

ప్రధాని నరేంద్ర మోడీ బుధవారం పోలెండ్ రాజధాని వార్సా చేరుకున్నారు. ఆయన ఆ తరువాత ఉక్రెయిన్ రాజధాని కీవ్‌కు వెళతారు. కాగా, పోలెండ్‌లో తన తొలి పర్యటన ద్వైపాక్షిక భాగస్వామ్యానికి ఊపు ఇస్తుందని, రెండు దేశాల ప్రజలకు ప్రయోజనకరమని ప్రధాని మోడీ పేర్కొన్నారు. పోలెండ్ అధ్యక్షుడు ఆంద్రెజ్ సెబాస్టియన్ దుదాతో భేటీ అయ్యే ప్రధాని మోడీ పోలెండ్ ప్రధాని డొనాల్డ్ టస్క్‌తో ద్వైపాక్షిక చర్చలు జరుపుతారు. పోలెండ్ రాజధానిలో వివిధ కార్యక్రమాల కోసం తాను ఎదురుచూస్తున్నట్లు మోడీ తెలియజేశారు. 'పోలెండ్‌లో దిగాను. ఇక్కడ వివిధ కార్యక్రమాల కోసం ఎదురుచూస్తున్నా.ఈ పర్యటన భారత్ పోలెండ్ స్నేహానికి ఊపు ఇస్తుంది, మన దేశాల ప్రజలకు ప్రయోజనకరం అవుతుంది' అని మోడీ వార్సా మిలిటరీ విమానాశ్రయంలో దిగిన వెంటనే 'ఎక్స్' పోస్ట్‌లో పేర్కొన్నారు.

మిగితా 2వ పేజీలో

## సీఎం పాప పరిహారం కోసం యాదాద్రికి వెళ్తున్నా..!

- తెలంగాణ ప్రజల శ్రేయస్సుకు ప్రత్యేక పూజలు
- మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీశ్‌రావు



**బలగం టీవీ, హైదరాబాద్ బ్యూరో**

సీఎం రేవంత్ రెడ్డి చేసిన పాపం ప్రజలకు శాపం కాకుండా చూసి రక్షించాలని యాదాద్రి శ్రీ లక్ష్మీనరసింహాస్వామిని ప్రార్థిస్తామని మాజీ మంత్రి హరీశ్‌రావు తెలిపారు. సీఎం రేవంత్ రెడ్డి పాప పరిహారం కోసం, తెలంగాణ ప్రజల శ్రేయస్సు కోసం గురువారం యాదాద్రి దేవాలయం దర్శించుకొని బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ఇతర నాయకులతో కలిసి పూజలు చేయబోతున్నామని ఆయన చెప్పారు. ఈ పాపాత్ముడైన ముఖ్యమంత్రిని క్షమించు, తెలంగాణ ప్రజలపై దయ ఉంచు అని యాదగిరి నరసింహాస్వామిని వేడుకుంటామమని హరీశ్‌రావు పేర్కొన్నారు. "ఆగస్టు15 లోగా రైతులందరికి రుణమాఫీ చేస్తానని సీఎం రేవంత్ రెడ్డి యాదాద్రి లక్ష్మీ నర్సింహాస్వామి మీద ఒట్టు పెట్టి మాట తప్పారు. రూ. 49 వేల కోట్ల వ్యవసాయ రుణాలు ఉన్నాయని డిసెంబర్ నెలలో చెప్పారు. కడుపు కట్టుకుంటే చాలు ఒక్క ఏడాదిలో రూ. 40 వేల కోట్ల రుణమాఫీ చేస్తానని జనవరిలో అన్నారు. క్యాబినెట్‌లో నిర్ణయించిన రూ. 31 వేల కోట్లు రుణమాఫీ చేస్తామని దేవుళ్ల మీద ఒట్లు పెట్టారు. మొన్నటి బడ్జెట్ కేటాయింపుల్లో రూ. 26 వేల కోట్లకు కుదించారు" అని హరీశ్‌రావు గుర్తు చేశారు.

"ఆగస్టు15 నాడు రుణమాఫీ పూర్తయిందని చెప్పి రూ. 17 వేల కోట్లన్నారు. రుణమాఫీ చేశామని ముఖ్యమంత్రి చెబుతుంటే మరోవైపు మంత్రులు కాలేదు అంటున్నారు. మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి రుణమాఫీ పూర్తిగా జరగలేదని, మిగిలిన రూ. 12 వేల కోట్లు కూడా విడుదల చేస్తామని ప్రకటించారు. మరో మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి 17 లక్షల మందికి ఇంకా రుణమాఫీ కాలేదని అంటున్నారు. ఇందులో ఎవరి మాట నిజమో తెలియక, రుణమాఫీ కాక రైతులు తీవ్ర ఆందోళనకు గురవుతున్నారు. వ్యవసాయ కార్యాలయాలు, బ్యాంకులు, కలెక్టరేట్ల చూట్టూ చెప్పులరిగేలా తిరుగుతున్నారు. కోతల ప్రభుత్వాన్ని ప్రశ్నించేందుకు, దేవుళ్ల మీద ఒట్లు వేసి మాట తప్పిన సీఎం రేవంత్ రెడ్డిని నిలదీసేందుకు గురువారం ఆలేరులో నిర్వహించే ధర్నాలో పాల్గొంటాను. రైతలందరి తరుపునా ఈ ప్రభుత్వాన్ని నిగ్గదీసి అడుగుతామని హరీశ్‌రావు తేల్చిచెప్పారు.

## జన్వాడ ఫాంహౌస్ కూల్చివేతపై స్టేకు హైకోర్టు నిరాకరణ




**బలగం టీవీ, హైదరాబాద్**

జన్వాడ ఫాంహౌస్ కూల్చొద్దంటూ ప్రదీప్‌రెడ్డి దాఖలు చేసిన పిటిషన్‌పై తెలంగాణ హైకోర్టులో విచారణ జరిగింది. ఫాంహౌస్ కూల్చివేయకుండా స్టే ఇవ్వడానికి ఉన్నత న్యాయస్థానం నిరాకరించింది. నిబంధనల ప్రకారం ముందుకు వెళ్లాలని ఆదేశించింది.

వాదనల సందర్భంగా హైడ్రాకు ఉన్న పరిధి గురించి చెప్పాలని ఏఏజీ ధర్మాసనం సూచించింది. హైడ్రా కూల్చివేతలపై దృష్టి సారించాల్సిన అవసరం ఉందని హైకోర్టు అభిప్రాయపడింది. ఇప్పటి వరకు హైడ్రా ఎన్ని కట్టడాలు కూల్చివేసింది, ప్రతి కూల్చివేతలోనూ నిబంధనలు పాటించారా? దీనికి సంబంధించి పూర్తి వివరాలు ఇవ్వాలని ఏఏజీని ఉన్నత న్యాయస్థానం ఆదేశించింది. చెరువుల ఎఫ్‌టీఎల్ పరిధిని నిర్ణయించారా? అని ప్రశ్నించింది. హైదరాబాద్ రోజురోజుకూ అభివృద్ధి చెందుతోందని, ఆక్రమణలు ఎక్కువయ్యాయని ఏఏజీ కోర్టు దృష్టికి తెచ్చారు. ఆక్రమణలకు గురవుతున్న ప్రభుత్వ భూములు, పార్కులు, చెరువులను రక్షించడానికి హైడ్రా ఏర్పాటు చేసినట్టు చెప్పారు. స్థానిక సంస్థలతో సమన్వయం చేసుకొని హైడ్రా పనిచేస్తుందన్నారు. స్థానిక సంస్థల ద్వారా నోటీసులు ఇచ్చిన తర్వాతే అక్రమ కట్టడాలు కూల్చివేస్తున్నామని తెలిపారు. ఈ పిటిషన్‌కు విచారణర్హత లేదని, కొట్టివేయాలని కోరారు.

2014లో జన్వాడలో ఫాంహౌస్ ఏర్పాటు చేశారని, 2019లో ప్రదీప్ ఫామ్‌హౌజ్ కొనుగోలు చేసినట్టు పిటిషనర్ తరపు న్యాయవాది కోర్టుకు తెలిపారు. పదేళ్ల తర్వాత ఇప్పుడు ఫాంహౌస్ ఎందుకు కూల్చాలనుకుంటున్నారు? ఇన్నేళ్లుగా అధికారులకు ఎఫ్‌టీఎల్ గుర్తుకు రాలేదా? అని హైకోర్టు ప్రశ్నించింది. రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న చెరువుల ఎఫ్‌టీఎల్‌ను నోటిఫై చేస్తే ఆ వివరాలు ఇవ్వాలని సూచించింది. ప్రాథమికంగా నోటిఫై చేశామని.. తుది నివేదిక రూపొందించే పనిలో ఉన్నామని ఏఏజీ తెలిపారు. జన్వాడ ఫాంహౌస్ ఎఫ్‌టీఎల్‌కు సంబంధించిన వివరాలు కూడా సమర్పించాలని హైకోర్టు ఆదేశించింది.

## రుణమాఫీ 30 శాతం..

# కాంగ్రెస్ మోసం 100 శాతం




- నేడు అన్ని మండల కేంద్రాల్లో రైతుల ధర్నాలు
- ఇది మొదటి అడుగు మాత్రమే
- ప్రజల దృష్టి మళ్లించేందుకు బజారు భాష..
- బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్

**బలగం టీవీ, హైదరాబాద్ బ్యూరో**

కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన రూ.2 లక్షల రుణమాఫీ హామీ బూటకమని.. రుణమాఫీ మొత్తం దగా, మోసమని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆరోపించారు. బుధవారం తెలంగాణ భవన్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. రుణమాఫీ విషయంలో ప్రభుత్వం చెబుతున్నవి అర్ధసత్యాలు, అసత్యాలన్నారు. రుణమాఫీ కాదని.. రైతులకు కుచ్చు టోపీ అని మండిపడ్డారు. రూ.2 లక్షలు రుణమాఫీ చేశామని మంత్రి తుమ్మల చెప్పారు. రుణమాఫీపై ఉత్తర కుమార ప్రగల్బాలు పలుకుతున్నారని.. రుణమాఫీపై రైతులకు ప్రభుత్వం క్షమాపణలు చెప్పాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

మాఫీ 30 శాతం, కాంగ్రెస్ మోసం 100 శాతమన్నారు. ఇది రైతు స్వరాజ్యం కాదు.. ఏడిపిస్తున్న రాజ్యమని ధ్వజమెత్తారు. రుణమాఫీ విషయంలో ప్రభుత్వ తీరును ఎండగడుతూ.. గురువారం అన్ని మండల కేంద్రాల్లో రైతుల ధర్నాలు ఉంటాయి. ఈ ఆందోళనలు మొదటి అడుగు మాత్రమేనని. రైతులపై కేసులు ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. రుణమాఫీ చేయనందుకు ప్రభుత్వం క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేశారు.

రాష్ట్రవ్యాప్తంగా రైతులు ఆగ్రహంతో రగిలిపోతున్నారని కేటీఆర్ ఆవేదన వ్యక్తం చేశారు. రుణమాఫీ జరగక రైతులు రోడ్డెక్కుతున్నరు.. ఏ పత్రిక, ఛానల్ చూసినా ఇవే వార్తలు కనిపిస్తున్నాయి. ఆందోళన చేస్తున్న రైతులపై ఏడేళ్లు, రెండేళ్లు శిక్షలు పడే కేసులు పెడుతూమరోవైపు అందరికి రుణమాఫీ అయిందని సీఎం సంబరాలు చేసుకుంటున్నారని కేటీఆర్ విమర్శించారు. రూ.31 వేల కోట్లు మాఫీ చేశామని సీఎం చెబుతున్నారు. రుణమాఫీపై మంత్రులు తలోమాట మాట్లాడుతున్నారు. సాంకేతిక కారణాలతో మాఫీ కాలేదని మంత్రులు చెబుతున్నారు. భట్టి చెప్పిన లెక్కలు వింటే రుణమాఫీ వట్టిదేనని తేలిపోయింది. మాఫీ ఎట్లా ఎగ్గొడదామని కాంగ్రెస్ ప్రభుత్వం ఎత్తుగడలు వేస్తుందని.. అసలు రుణమాఫీపై ప్రభుత్వానికి స్పష్టత ఉందా..? లేదా..? అని కేటీఆర్ ప్రశ్నించారు.

పచ్చి మోసగాళ్ల ప్రభుత్వం ఇదని.. 49 వేల కోట్ల వ్యవసాయ రుణాలున్నాయని చెప్పింది మీరా..కాదా..? అని కాంగ్రెస్ ప్రభుత్వాన్ని ప్రశ్నించిన కేటీఆర్.. ప్రభుత్వం రుణమాఫీ పేరుతో కేవలం రూ.7500 కోట్లతో సరిపెట్టాలని చూస్తున్నట్టుందన్నారు. లక్షల మంది రైతులను మోసం చేసిన ఈ ప్రభుత్వాన్ని ఏం చేయాలి..? సీఎం తడిగుడ్డతో రైతుల గొంతు కోసిండు. ప్రజల దృష్టి మళ్లించేందుకు సీఎం రేవంత్ బజారు భాష మాట్లాడుతున్నారు. కేసీఆర్‌ను తిడితే సంబరపడే కొన్ని మీడియా సంస్థలున్నాయి. మొత్తం రుణమాఫీ చేసే వరకు ప్రభుత్వాన్ని వెంటాడుతామని కేటీఆర్ హెచ్చరించారు.

సీఎం వ్యాఖ్యలకు నిరసనగా తెలంగాణ తల్లి విగ్రహానికి పాలాభిషేకాలు చేస్తామని కేటీఆర్ వెల్లడించారు. ఎప్పటిలోగా రుణమాఫీ పూర్తి చేస్తారో చెప్పాలని కేటీఆర్ ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. ఎలాంటి ఆంక్షలు లేకుండా బీఆర్ఎస్ ఉన్నంతకాలం రైతులకు అండగా ఉంటుందని, రైతులు స్థైర్యం కోల్పోవద్దని కేటీఆర్ విజ్ఞప్తి చేశారు.

## నాకెలాంటి ఫామ్ హౌజ్ లేదు..

- ఆ ఫామ్ హౌజ్‌నా స్నేహితుడిది
- అది ఎఫ్‌టీఎల్ లేదా బఫర్ జోన్‌లో ఉంటే నేనే దగ్గర్నుండి కూలగొట్టిస్తా
- ఎఫ్‌టీఎల్, బఫర్ జోన్లలో మంత్రులు, కాంగ్రెస్ నేతలు కట్టిన రాజభవనాల సంగతేంటి
- రేవంత్ రెడ్డిది కూడా ఫామ్ హౌస్ ఉంది.
- బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్

వివరాలు 2వ పేజీలో

## సీఎం రేవంత్ వచ్చినా బీజేపీలో చేర్చుకుంటాం.

- బండి సంజయ్ సంచలన వ్యాఖ్యలు





**బలగం టీవీ,హైదరాబాద్**

మోడీ సిద్ధాంతాలపై విశ్వాసాన్ని ప్రకటించి ఎవరు వచ్చినా పార్టీలో చేర్చుకుంటామని, ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి వచ్చినా అభ్యంతరం చెప్పకుండా జాయిన్ చేసుకుంటామని కేంద్ర హోం సహాయ మంత్రి బండి సంజయ్ సంచలన వ్యాఖ్యలు చేశారు. ఢిల్లీ లిక్కర్ కేసులో నిందితురాలిగా ఉన్న ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత తరపున లాయర్‌గా ఉన్న అభిషేక్ మను సింఘ్వికి కాంగ్రెస్ టికెట్ ఇచ్చిందని, కేసీఆర్ ఆదేశాలతోనే ఈ అవకాశం వచ్చిందన్నారు. ఆ రెండు పార్టీలూ ఒక్కటేనని అనడానిక

వివరాలు 2వ పేజీలో

## విద్యార్థినులకు అశ్లీల వీడియోలు చూపించి..



- అసభ్యంగా ప్రవర్తించిన స్కూలు టీచర్

**బలగం టీవీ,ముంబై**

పాఠశాల విద్యార్థినులకు అశ్లీల వీడియోలను చూపించి వారితో అసభ్యంగా ప్రవర్తించిన ఒక 47 ఏళ్ల ప్రభుత్వ పాఠశాల టీచర్‌ను పోలీసులు అరెస్టు చేశారు. కాగా..విద్యార్థినులను లైంగికంగా వేధించిన ఆ టీచర్‌ను ఉద్యోగం నుంచి ప్రభుత్వం బర్తరఫ్ చేసినట్లు మహారాష్ట్రలోని అకోల జిల్లా పరిషద్ ఎగ్జిక్యూటివ్ అధికారి బి వైష్ణవి బుధవారం తెలిపారు. అకోల నగరానికి 40 కిలోమీటర్ల దూరంలోని కాజీఖేడ గ్రామంలోని జిల్లా పరిషద్ పాఠశాలలో తాజా ఘటన వెలుగు చూసింది. గడచిన నాలుగు నెలలుగా ప్రమోద్ సర్దార్ అనే టీచర్ పాఠశాలలోని 8వ తరగతి విద్యార్థినులకు తన మొబైల్ ఫోన్‌లో అశ్లీల వీడియోలు చూడాలని వారిని ఒత్తిడి చేస్తున్నట్లు విద్యార్థినుల నుంచి ఫిర్యాదులు వచ్చాయి. బాధితులలో ఒక విద్యార్థిని ధైర్యం చేసి 1098 చైల్డ్ హెల్ప్‌లైన్‌కు ఫోన్ చేసి టీచర్ గురించి ఫిర్యాదు చేయడంతో ఈ వ్యవహారం బయటపడింది. వెంటనే స్పందించిన శిశు సంక్షేమ కమిటీ(సిడబ్లుసి) మంగళవారం తన సభ్యులను పాఠశాలకు పంపించింది. విద్యార్థులకు క్లాసు తీసుకోవాలన్న కారణం చూపి 8వ తరగతి విద్యార్థినులతో కమిటీ సభ్యులు విడిగా సమావేశమయ్యారు. గడచిన నాలుగు నెలలుగా టీచర్ ప్రమోద్ సర్దార్ నుంచి తాము ఎదుర్కొంటున్న లైంగిక వేధింపులను విద్యార్థినులు కమిటీ సభ్యులకు వివరించారు. బాలికల నుంచి వివరాలను రాబట్టిన కమిటీ సభ్యులు వెంటనే పోలీసులకు సమాచారం అందించారు. సిడబ్లుసి సభ్యుల నుంచి ఫోన్ రావడంతో బాలికల వాంగ్మూలాన్ని నమోదు చేసుకోవడానికి తమ పోలీసు బృందాన్ని స్కూలుకు పంపించినట్లు ఉరల్ పోలీసు స్టేషన్ ఇన్‌స్పెక్టర్ గోపాల్ ధోలే తెలిపారు. అనంతరం టీచర్ ప్రమోద్ సర్దార్‌ను అరెస్టు చేసి పోక్సో చట్టం కింద కేసు నమోదు చేశామని ఆయన చెప్పారు.

కాగా..తన స్కూలులో పనిచేసే టీచర్ విద్యార్థినులను లైంగిక వేధిస్తున్న విషయం తన దృష్టికి రాలేదని స్కూలు ప్రిన్సిపాల్ రవీంద్ర సండూర్ తెలిపారు. ఈ విషయం తెలిసి ఉంటే తాను వెంటనే టీచర్‌పై చర్యలు తీసుకుని ఉండేవాడినని చెప్పారు. సిడబ్ల్యుసి సభ్యుల రాకతోనే ఈ విషయం వెలుగులోకి వచ్చిందని ఆయన చెప్పారు. ఇలా ఉండగా..ఈ ఘటనపై మహారాష్ట్ర రాష్ట్ర మహిళా కమిషన్ మాజీ సభ్యురాలు ఆషా మిర్జే తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తూ టీచర్ ప్రవర్తనను ఖండించారు. స్కూలులో ఇంత జరుగుతున్నా ఇతర సిబ్బందికి తెలియకపోవడాన్ని ఆమె ప్రశ్నించారు.

# సిద్దిపేటలో 3 ఏండ్ల చిన్నారిపై లైంగికదాడి

**బలగం టీవీ, సిద్దిపేట**

సిద్దిపేట పట్టణంలో దారుణం జరిగింది. మూడేండ్ల చిన్నారిపై ఓ వ్యక్తి పాల్పడ్డాడు. నిందితుడిని 24 గంటల్లోనే పట్టుకున్న పోలీసులు, పలు సెక్షన్ల కింద కేసులు నమోదు చేసి రిమాండ్‌కు తరలించారు.

సిద్దిపేట త్రీటౌన్ సీఐ విద్యాసాగర్ తెలిపిన వివరాల ప్రకారం సిద్దిపేట పట్టణంలో నూతనంగా నిర్మిస్తున్న బిల్డింగ్‌లో నేపాల్‌కు చెందిన ఓ వ్యక్తి వాచ్‌మెన్‌గా పనిచేస్తూ తన కుటుంబంతో అక్కడే నివసిస్తున్నాడు. ఈ నేపథ్యంలో మూడేళ్ల చిన్నారి తన నాయనమ్మ, తాతల వద్ద ఆడుకుంటూ బిల్డింగ్‌లో ఉంటోంది. ఈ క్రమంలో నిర్మాణంలో ఉన్న బిల్డింగ్ పెయింటింగ్ వర్క్స్ కోసం యూపీకి చెందిన అజయ్ కూడా వచ్చి భవనంలోనే నివసిస్తున్నాడు. ఈ నేపథ్యంలో నిందితుడు చిన్నారిని ఆడిస్తానని తీసుకెళ్లి లైంగికదాడికి పాల్పడ్డాడు. చిన్నారి కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేపట్టారు. నిందితుడు యూపీకి పారిపోతుండగా పోలీసులు 24 గంటల్లోనే సిద్దిపేట పట్టణంలో గాలించి పట్టుకున్నారు. నిందితుడిపై లైంగికదాడి, పోక్సోతో పాటు పలు సెక్షన్ల కింద కేసులు నమోదు చేసి, రిమాండ్ తరలించినట్లు సీఐ విద్యాసాగర్ తెలిపారు. చిన్నారిని ఆసుపత్రికి తరలించి మెరుగైన వైద్యం అందిస్తున్నట్లు చెప్పారు.

# మొదటి ఏడాదిలోనే రుణమాఫీ చేశాం



- మీలాగా ఐదేళ్లు వాయిదాలతో చేయలేదు
- డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క

**బలగం టీవీ, ఖమ్మం**

రుణమాఫీకి సంబంధించి ఈ దేశంలో ఎవరు ఊహించని విధంగా, ఏ రాష్ట్రంలో జరగని విధంగా ఒకేసారి చేశామన్న ఆయన, అది కూడా అధికారం చేపట్టిన మొదటి సంవత్సరంలోనే పూర్తి చేశామని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క తెలిపారు. రుణమాఫీ గురించి అవగాహన లేనివారు అవాకులు చవాకులు పేలుతున్నారని మండిపడ్డారు. ఖమ్మం జిల్లా మధిర నియోజకవర్గంలోని జమలాపురంలో పర్యటించారు. ఐదు సంవత్సరాల్లో లక్ష రుణమాఫీ చేయలేని వాళ్లు, మొదటి సంవత్సరంలోనే 2 లక్షల రుణమాఫీ చేసిన వారి గురించి సిగ్గు ఎగ్గు లేకుండా మాట్లాడుతున్నారని, ఆ భాష మాట్లాడడానికి బాధగా ఉందన్నారు. 2 లక్షల పైన బ్యాంకు రుణం తీసుకున్న రైతులు, పై మొత్తాన్ని చెల్లించి వ్యవసాయ శాఖకు సమాచారం ఇస్తే వెంటనే 2 లక్షల రుణమాఫీ అవుతుందని స్పష్టం చేశారు.

“జూలై 17న రుణమాఫీ జీవో ఇచ్చి వెంటనే 18వ తేదీన మొదటి విడుత లక్ష వరకు రుణం ఉన్నవారి ఖాతాలో డబ్బులు జమ చేశాం. రెండో విడుత 15 రోజుల వ్యవది. లోనే ఆలస్యం జరగకుండా జూలై 30న అసెంబ్లీలో లక్షన్నర వరకు బ్యాంకు రుణం ఉన్నవారికి వారి ఖాతాల్లో నగదు జమ చేశాం. మూడో విడుత ఆగస్టు 15న వైరా బహిరంగ సభలో 2 లక్షల వరకు బ్యాంకు రుణం ఉన్న రైతుల ఖాతాలోకి నగదు జమ చేశాం. గత పాలకులు 2014 నుంచి 2018 వరకు లక్ష రుణం ఐదు సంవత్సరాల పాలనా కాలంలో నాలుగు వాయిదాలలో చెల్లించారు. వారు వాయిదాలలో చెల్లించడంతో అది వడ్డీలకే సరిపోయింది. బ్యాంకర్లు రైతులకు కొత్తగా రుణాలు ఇవ్వలేకపోయారు. రెండో దఫా అధికారంలోకి వచ్చినప్పుడు ఎన్నికల ముందు అరకొరగా రైతులకు రుణమాఫీ చేశారు. మాది ప్రజా ప్రభుత్వం. మీలాగా మేము దోపిడీలు చేయలేదు. రాష్ట్ర సంపద ప్రతి పైసా పేదవారికి చేరుస్తాం. గత పది సంవత్సరాలు పంటల బీమా కూడా చేయని దుర్మార్గులు మీరు. గత పది సంవత్సరాల్లో పంట నష్టపోతే ఒక్క రూపాయి కూడా రైతులకు రాలేదు. మేము అధికారంలోకి రాగానే పంటల బీమా కోసం రైతులు కట్టాల్సిన డబ్బులను బీమా కంపెనీలకు చెల్లించాం. పంటల బీమానే కాదు రైతు బీమా డబ్బులు కూడా రైతుల పక్షాన ప్రభుత్వం ఇప్పటికే చెల్లించింది. ఏ రైతు బీమా పేరిట ఒక్క రూపాయి కూడా కట్టాల్సిన అవసరం లేదు. ఇది మా ప్రభుత్వ నిబద్ధత. చరిత్రలో ఎన్నడూ లేని విధంగా వ్యవసాయ అనుబంధ రంగాలకు 72 వేల కోట్లు బడ్జెట్‌లో కేటాయించాం” అని వివరించారు డిప్యూటీ సీఎం.

# అచ్యుతాపురం ఫార్మా సెజ్‌లో పేలుడు



**బలగం టీవీ, హైదరాబాద్**

అనకాపల్లి జిల్లా రాంబిల్లి మండలం అచ్యుతాపురం ఫార్మా సెజ్లో బుధవారం మధ్యాహ్నం ఘోర ప్రమాదం జరిగింది. రియాక్టర్ పేలిన ఘటనలో 16 మంది మృతి చెందారు.మరో 50మందికి పైగా గాయపడ్డారు. ప్రమాద తీవ్రతను బట్టి మృతుల సంఖ్యపెరిగే అవకాశముందని భావిస్తున్నారు. అచ్యుతాపురంఫార్మా సెజ్లోని ఎసెన్షియా అడ్వాన్సుడ్ సైన్స్ ప్రైవేట్లిమిటెడ్లో వందల సంఖ్యలో కార్మికులు, సిబ్బంది పనిచేస్తున్నారు. భోజన విరామ సమయం మధ్యాహ్నం 1:30ప్రాంతంలో ఈ భారీ పేలుడు సంభవించి మంటలు చెలరేగాయి. దట్టంగా పొగ అలుముకొని ఏం జరుగుతుందో అర్థం కాని పరిస్థితి నెలకొంది.కార్మికులు ప్రాణ భయంతో బయటకు పరుగులు తీశారు. భారీ శబ్దంతో సమీప గ్రామాల ప్రజలు ఒక్కసారిగా ఉలిక్కిపడ్డారు. ఫార్మా సెజ్ లోని అగ్నిమాపక యంత్రం సహా చుట్టుపక్కల నుంచి మరో 11 యంత్రాలు వచ్చి మంటలను అదుపు చేశాయి.క్షతగాత్రులను చికిత్స కోసం అనకాపల్లిలోని వేర్వేరు ఆసుపత్రులకు తరలించారు. గాయపడ్డ వారిలో ఐదుగురు 60 శాతానికి పైగా కాలిన గాయాలతో ఉన్నట్టు తెలుస్తోంది. వీరిలో మరికొందరు పరిస్థితి విషమంగా ఉంది.


ప్రమాదం జరిగిన సమయంలో పరిశ్రమలో దాదాపు 300 మంది కార్మికులు ఉన్నట్టు సమాచారం. రియాక్టర్ పేలుడు ధాటికి పరిశ్రమలోని మొదటి అంతస్తు శ్లాబు కూలిపోయిందని, శిథిలాల కింద పలువురు చిక్కుకున్నట్టు కార్మికులు చెబుతున్నారు. మూడో అంతస్తులో చిక్కుకున్న కార్మికులను క్రేన్ సాయంతో బయటకు తీసుకొచ్చారు. ఎన్డీఆర్ఎఫ్ బృందాలు, అగ్నిమాపక సిబ్బందితో ఘటనా స్థలిలో సహాయక చర్యలు కొనసాగుతున్నాయి.

# కానిస్టేబుళ్ల సరెండర్ లీవ్‌ల బకాయిలు చెల్లించండి..

- మాజీ మంత్రి హరీశ్‌రావు

**బలగం టీవీ, హైదరాబాద్**


రాష్ట్రంలోని కానిస్టేబుళ్ల సరెండర్ లీవ్‌ల బకాయిలు చెల్లించాలని మాజీ మంత్రి హరీశ్‌రావు డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్కను కోరారు. రాష్ట్రంలోని పోలీస్ కానిస్టేబుల్ ఉద్యోగులకు సరెండర్, అడిషనల్ సరెండర్ లీవ్ బెనిఫిట్ కింద అందించే డబ్బులు కొన్ని జిల్లాలకు మాత్రమే అందించి మరికొన్ని జిల్లాలకు అందించకపోవడం బాధాకరమని హరీశ్‌రావు పేర్కొన్నారు. రాష్ట్రంలోని కామారెడ్డి, నిజామాబాద్, మెదక్, సంగారెడ్డి, సిద్దిపేట జిల్లాలోని దాదాపు 6వేల మంది కానిస్టేబుల్స్‌కు సరెండర్, అడిషనల్ సరెండర్ లీవ్ బెనిఫిట్ గత ఎనిమిది నెలలుగా పెండింగ్‌లో పెట్టారు. పెట్రోల్, డీజిల్ బిల్లులు కూడా నెలల తరబడి రాక పోలీసులు, పెట్రోల్ బంక్ వారు కూడా ఇబ్బందులు పడుతున్నారని హరీశ్‌రావు తెలిపారు. “వీరి పట్ల ఎందుకు ఇంత వివక్ష.? రాష్ట్ర పోలీసులలో వీళ్ళు భాగం కాదా..? ఒకే డిపార్ట్మెంట్లో ఇంత పక్షపాతం ఎందుకు..? ఇది వారి



ఆత్మస్థైర్యాన్ని దెబ్బతీయడమే.. యూనిఫామ్ సర్వీస్ వాళ్లు కాబట్టి వాళ్లు బయటకు రాలేకపోతున్నారు. వాళ్ళ సమస్యను నేను మీ దృష్టికి తెస్తున్నాను తక్షణమే పెండింగ్ బకాయిలు విడుదల చేయాలని డిమాండ్ చేస్తున్నాం” అని హరీశ్‌రావు పేర్కొన్నారు.

# వారంలో రోజుల్లో కొత్త పార్టీ..

- చంపై సోరెన్



**బలగం టీవీ, రాంచీ**

వారం రోజుల్లో కొత్త పార్టీ ఏర్పాటు చేయనున్నట్లు జార్ఖండ్ మాజీ సీఎం చంపై సోరెన్ తెలిపారు. అలాగే కలిసి వచ్చే వారితో పొత్తు పెట్టుకుంటానని చెప్పారు. ఉన్నట్టుండి ఢిల్లీకి వెళ్లిన ఆయన బీజేపీలో చేరుతారంటూ ఊహాగానాలు వచ్చాయి. అయితే తన భవిష్యత్తు రాజకీయ ప్రణాళిక గురించి చంపై సోరెన్ బుధవారం స్పష్టత ఇచ్చారు. కొత్త రాజకీయ పార్టీని ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. ‘మూడు అవకాశాల గురించి నేను ప్రస్తావించా. పదవీ విరమణ, కొత్త పార్టీ లేదా వేరే పార్టీలో చేరిక. నేను పదవీ విరమణ చేయను. కొత్త పార్టీని బలోపేతం చేస్తా. మంచి స్నేహితుడిని కలిస్తే వారితో కలిసి ముందుకు సాగుతా’ అని అన్నారు.

# భూసేకరణ వేగం పెంచండి

(మొదటి పేజీతరువాయి)

అర్బన్ తెలంగాణ, రూరల్ తెలంగాణ సమగ్రాభివృద్ధి లక్ష్యంగా ఔటర్ రింగ్ రోడ్డు , రీజినల్ రింగ్ రోడ్డు మధ్య అనుసంధానానికి అనువుగా రహదారుల ప్రణాళికలు ఉండాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చెప్పారు. ప్రధాన రహదారులకు అనుసంధానం చేసే ప్రదేశాలను ముందుగానే గుర్తించి నిరంతరం సాఫీగా ప్రయాణాలు సాగేందుకు వీలుగా నిర్మాణాలు ఉండాలని సీఎం అన్నారు.

భవిష్యత్తు అవసరాలే ప్రాతిపదికగా ఆర్ఆర్ఆర్ అలైన్‌మెంట్ ఉండాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చెప్పారు. ఫ్యూచర్ సిటీలో ఏర్పాటు కానున్న వివిధ రకాల పరిశ్రమలు, సంస్థలకు ఉపయోగకరంగా ఈ రోడ్ల ప్రణాళికలు ఉండాలని స్పష్టం చేశారు.

ఆర్ఆర్ఆర్ కింద ఉత్తర భాగం సంగారెడ్డి -భువనగిరి- చౌటుప్పల్ మార్గంలో భూసేకరణ దాదాపుగా పూర్తి కాగా, ఆర్ఆర్ఆర్ దక్షిణ భాగంలోని (చౌటుప్పల్-ఆమన్‌గల్ -షాద్ నగర్ -సంగారెడ్డి (189.20 కి.మీ.)మార్గానికి సంబంధించి భూ సేకరణ,అలైన్‌మెంట్ అంశాలపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధికారులకు పలు సూచనలు చేశారు. ఆ సూచనలకు అనుగుణంగా క్షేత్రస్థాయిలో పర్యటించి సమగ్ర నివేదిక తయారు చేసి త్వరగా అందజేయాలని అధికారులను సీఎం ఆదేశించారు. ఆర్ఆర్ఆర్ విషయంలో ఏవైనా సాంకేతిక సమస్యలుంటే వెంటనే కేంద్ర ప్రభుత్వంతో చర్చించాలని సీఎం చెప్పారు.

ఈ సమీక్షా సమావేశంలో రోడ్లు, భవనాల శాఖ మంత్రి సమావేశంలో మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి గారు, ముఖ్యమంత్రి సలహాదారు వేం నరేందర్ రెడ్డి గారు, నల్గొండ ఎంపీ కుందూరు రఘువీర్ రెడ్డి గారు, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి గారు, ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

# నాకెలాంటి ఫామ్ హౌజ్ లేదు..

- ఆ ఫామ్ హౌజ్‌నా స్నేహితుడిది
- అది ఎఫ్‌టీఎల్ లేదా బఫర్ జోన్‌లో ఉంటే నేనే దగ్గర్నుండి కూలగొట్టిస్తా
- ఎఫ్‌టీఎల్, బఫర్ జోన్లలో మంత్రులు, కాంగ్రెస్ నేతలు కట్టిన రాజభవనాల సంగతేంటి..?
- రేవంత్ రెడ్డిది కూడా ఫామ్ హౌస్ ఉంది.
- బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్



**బలగం టీవీ, హైదరాబాద్**

బఫర్ జోన్‌లోని కానీ, ఎఫ్‌టీఎల్‌లో కానీ తనకంటూ ఎలాంటి ఫామ్ హౌజ్ లేదు.. మీరు చెప్తున్న ఆ ఫామ్ హౌజ్ తన స్నేహితుడిది అని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ స్పష్టం చేశారు. తెలంగాణ భవన్‌లో కేటీఆర్ మీడియాతో మాట్లాడారు. తన స్నేహితుడి ఫామ్ హౌజ్ ఎఫ్‌టీఎల్ లేదా బఫర్ జోన్‌లో ఉంటే నేనే దగ్గర్నుండి కూలగొట్టిస్తా. నో ప్రాబ్లం.. మంచి జరుగుతున్నప్పుడు అందరం ఆహ్వానించాల్సిందే. కానీ కాంగ్రెస్ ప్రభుత్వాన్ని ఒక్కటే అడుగుతున్నాను. ఎఫ్‌టీఎల్, బఫర్ జోన్లలో మంత్రులు, పెద్ద పెద్ద కాంగ్రెస్ నేతలు కట్టిన రాజభవనాల సంగతి ఏంది..? నా స్నేహితుడి ఫామ్ హౌజ్‌ను మరి జూమ్‌లు పెట్టి తీస్తున్నారు.. అవి సోషల్ మీడియాలో కనబడు తున్నాయి. కానీ చెరువుల్లో కట్టుకున్న మంత్రుల ఫామ్ హౌజ్‌ల సంగతి ఏంది..? చెరువుల్లో కట్టుకున్న బడా కాంగ్రెస్ నాయకుల ఫామ్ హజ్‌లు కూలగొట్టే దమ్ము హైడ్రాకు లేదా..? అని కేటీఆర్ ప్రశ్నించారు.

ఎఫ్‌టీఎల్ పరిధిలో కట్టుకున్న మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, కేవీపీ రామచంద్రరావు, ఎమ్మెల్సీ పట్నం మహేందర్ రెడ్డి, కౌన్సిల్ చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి, మధు యాష్కీ, వీళ్ళందరి ఫామ్ హౌజ్‌ల దగ్గరికి వెళ్ళి కూలగొడదాం. వీరితో పాటు రేవంత్ రెడ్డిది కూడా ఫామ్ హౌస్ ఉంది. సీఎం ఫామ్ హౌజ్ గురించి శాటిలైట్ మ్యాప్‌లను కూడా మీడియాకు పంపిస్తాను చూసుకోండి. నా పేరు మీద ఫామ్ హౌజం ఉన్నట్లు మీడియాలో ఏవేవో కథనాలు రాస్తున్నారు. కానీ స్పష్టంగా చెబుతున్నా.. నా పేరు మీద ఏ ప్రాపర్టీ లేదు. నేను లీజు మీద ఉన్నాను. ఒక వేళ తప్పు జరిగితే.. దగ్గరుండి కూల్చివేయించేందుకు సహకరిస్తాను. ఇక హైడ్రానో.. అమీబానో ఉంది కదా.. దాని తీసుకొని అక్కడ్నుంచి నేరుగా పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి నుంచి మొదలు పెడుదాం. వాళ్ల తమ్ముడు కూడా అక్కడే ఉన్నాడు. అన్నీ ఒక్కటే రోజు కూలగొడుదాం.. ప్రజలకు పారదర్శకంగా ఉందాం. ప్రభుత్వం ఎలాంటి చర్య తీసుకున్నా నాకు ఎలాంటి ఇబ్బంది, అభ్యంతరం లేదు అని కేటీఆర్ స్పష్టం చేశారు.

# పోలెండ్‌లో ప్రధాని మోడీ..

(మొదటి పేజీతరువాయి)

ప్రధాని మోడీ హొటల్ చేరుకున్నప్పుడు పోలెండ్‌లోని భారతీయ సమాజం సభ్యులు సాదర స్వాగతం పలికారు. అక్కడ పోలిష్, భారతీయ కళాకారులు గుజరాతీ సంప్రదాయ నృత్యం ప్రదర్శించారు. తన రెండు రోజుల పర్యటనలో పోలిష్ నాయకత్వంతో ప్రధాని మోడీ చర్చలు వివిధ అంశాలపై ఉన్నత స్థాయిలో అభిప్రాయాల మార్పిడికి ఉభయ పక్షాలకు వీలు కల్పిస్తుంది, అది ఒక విధంగా అసలైన ‘ప్రయోజనకర అభిప్రాయాల మార్పిడి’ అని పోలెండ్‌లోని భారత రాయబారి నగ్మా మొహమద్ మల్లిక్ వార్సాలో ‘పిటిఐ’ వీడియోస్‌తో చెప్పారు. మోడీ వార్సా నుంచి కీవ్‌కు వెళతారు. ఉక్రెయిన్ 1991లో స్వతంత్ర దేశమైనప్పటి నుంచి ఆ దేశానికి ఒక భారత ప్రధాని జరపనున్న తొలి పర్యటన అవుతుంది. ‘పోలెండ్ నుంచి ఉక్రెయిన్ అధ్యక్షుడు వొలోదిమిర్ జెలెన్‌స్కీ ఆహ్వానంపై ఉక్రెయిన్‌ను సందర్శించనున్నాను. ఉక్రెయిన్‌కు ఇది ఒక భారత ప్రధాని తొలి పర్యటన’ అని మోడీ తెలిపారు. ‘ద్వైపాక్షిక సహకారం పటిష్ఠతపై అధ్యక్షుడు జెలెన్‌స్కీతో గత సంభాషణలపై ముందుగు సాగేందుకు, ఉక్రెయిన్ ప్రస్తుత వివాదం శాంతియుత పరిష్కారంపై అభిప్రాయాలు పంచుకునేందుకు అవకాశం కోసం ఎదురుచూస్తున్నాను’ అని ఆయన తెలిపారు. ‘ఒక మిత్రునిగా, భాగస్వామిగా ఈ ప్రాంతంలో శాంతి, సుస్థిరతలు సత్వరం తిరిగి నెలకొనగలవని ఆశిస్తున్నాం’ అని మోడీ తెలియజేశారు. రెండు దేశాలతో విస్తృత సంబంధాల కొనసాగింపునకు, మున్ముందు సుదృఢమైన, మరింత చైతన్యవంతమైన సంబంధాలకు వేదిక సృష్టికి తన వార్సా, కీవ్ పర్యటన దోహదం చేస్తుందని దృఢంగా నమ్ముతున్నానని మోడీ తెలిపారు.

# రేవంత్ వచ్చినా బీజేపీలో చేర్చుకుంటాం.

(మొదటి పేజీతరువాయి)

ఇంతకంటే నిదర్శనం ఏం కావాలని బండి సంజయ్ ప్రశ్నించారు. సభ్యత్వ నమోదులో భాగంగా సికింద్రాబాద్‌లోని క్లాసిక్ గార్డెన్‌లో జరిగిన కార్యక్రమంలో ఆయన పై వ్యాఖ్యలు చేశారు. ఈ రెండు పార్టీలూ దొంగ నాటకాలు ఆడుతున్నాయని ఆరోపించారు. త్వరలోనే ఈ రెండు పార్టీల మధ్య విలీన ప్రక్రియ కార్యరూపం దాల్చనున్నదని కామెంట్ చేశారు. రాజ్యసభ ఎన్నికల్లో ఇప్పటివరకు అభ్యర్థిని బీఆర్ఎస్ ఖరారు చేయలేదని, ఆ పార్టీకి 39 మంది ఎమ్మెల్యేలు ఉన్నా అవకాశాన్ని వదులుకుంటున్నదని బండి సంజయ్ అన్నారు. బీజేపీకి అంతటి సంఖ్యాబలమే ఉన్నట్లయితే అభ్యర్థిని నిలబెట్టేదని అన్నారు. ఎవరి ప్రయోజనాల కోసం బీఆర్ఎస్ సైలెంట్‌గా ఉన్నదని ప్రశ్నించారు. పదిమంది కాంగ్రెస్ ఎమ్మెల్యేలు ఈ మధ్యనే ఎర్రవల్లి ఫామ్‌హౌజ్‌కు వెళ్ళి కేసీఆర్‌ని కలిశారని, ఈసారి రాజ్యసభ ఎన్నికల్లో క్రాస్ ఓటింగ్ జరిగే అవకాశముందన్నారు. కేసీఆర్ చెప్పినట్లు కాంగ్రెస్ చేస్తున్నదని, ఈ రెండు పార్టీల మధ్య విలీనం కోసం ఢిల్లీ స్థాయిలో రహస్య ఒప్పందం జరగడమే ఇందుకు కారణమన్నారు. రుణ మాఫీ ఫలాలు అందక రైతులు ఇబ్బంది పడుతూ ఉంటే విగ్రహాల రాజకీయాలు అవసరమా అని ప్రశ్నించారు.

కొన్ని విగ్రహాలను కూలగొట్టాలనుకుంటే కూల్చండి అని కామెంట్ చేసిన బండి సంజయ్... అధికారంలో ఉన్న పార్టీలు వాటికి అనుకూల విగ్రహాలను పెట్టుకుంటాయన్నారు. వాజ్‌పేయి విగ్రహాన్ని పెట్టాలని తాము కోరుకుంటున్నామని, రాజీవ్‌గాంధీ, కేసీఆర్ విగ్రహాలతో పాటు దీనిపైన కూడా చర్చ జరపాలన్నారు. ‘హైడ్రా’లో ఇచ్చిపుచ్చుకొనే ధోరణి నడుస్తోందని, చిన్నచిన్న స్థలాలు ఉన్నవారి దగ్గరికి వెళ్ళడం తప్ప ఐదెకరాలకు పైబడినవారి దగ్గరికి హైడ్రా వెళ్ళడం లేదున్నారు. కేటీఆర్ సంసారిలా మాట్లాడుతున్నారుగానీ... జన్వాడలోని ఫామ్ హౌజ్ ఆయనకు చెందినది కాబట్టే ఆనాడు డ్రోన్ ఎగరేసినందుకు రేవంత్‌రెడ్డిపై కేసు పెట్టారని ఆరోపించారు. అప్పుడు లేని లీజు సంగతి ఇప్పుడు తెరపైకి వచ్చిందా అని బండి సంజయ్ ప్రశ్నించారు.

# విషజ్వరాలకు బలవుతున్న ప్రజలు..

- ప్రభుత్వానికి చీమ కుట్టినట్టైనా లేదు
- ముందే ప్రభుత్వాన్ని హెచ్చరించాం
- ఇప్పటికైనా ఉన్నత స్థాయి సమీక్ష నిర్వహించి చర్యలు తీసుకోవాలి
- మాజీ మంత్రి హరీష్ రావు

**బలగం టీవీ, హైదరాబాద్**

డెంగీ, మలేరియా, గన్యా వంటి విషజ్వరాలతో రాష్ట్రం వణుకుతున్నా కాంగ్రెస్ ప్రభుత్వానికి చీమ కుట్టినట్టైనా లేకపోవడం శోచనీయమని మాజీ మంత్రి హరీష్ రావు అన్నారు. ఈ మేరకు ఆయన ఎక్స్‌లో పోస్ట్ చేశారు.

“డెంగీ జ్వరాల బారిన పడి 24 గంటల్లో ఐదుగురు ప్రాణాలు కోల్పోవడం అత్యంత బాధాకరం. ప్రభుత్వ నిర్లక్ష్యం, రాష్ట్ర ప్రజలకు శాపంగా మారుతున్నది. ఇలాంటి పరిస్థితులు వస్తాయని ముందే ప్రభుత్వాన్ని హెచ్చరించాం. నిధులు విడుదల చేసి పారిశుద్ధ్య నిర్వహణ కొనసాగించాలని, ప్రజారోగ్యానికి అధిక ప్రాధాన్యమివ్వాలని వానాకాలం ప్రారంభంలోనే కోరాము. కానీ ప్రభుత్వం మా సూచనలను పెడచెవిన పెట్టింది. సకాలంలో చర్యలు తీసుకొని ఉంటే విషజ్వరాలు ఇంతగా విజృంబించేవి కావు.

ఏటా వానాకాలం ప్రారంభంలోనే పారిశుద్ధ్య చర్యలు తీసుకోవాల్సిన బాధ్యత ప్రభుత్వాల మీద ఉంటుంది. కానీ ఈ ప్రభుత్వం మొదటి నుంచి పూర్తి నిర్లక్ష్యం వహిస్తూ వచ్చింది. ముఖ్యమంత్రి, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి స్థాయిలో ఒక్కనాడు కూడా సమీక్ష నిర్వహించ లేదు. దోమల నివారణకు గ్రామాలు, పట్టణాల్లో స్పెషల్ డ్రైవ్ లు చేపట్టలేదు. ప్రభుత్వం పట్టించుకోకపోవడంతో హైదరాబాద్ సహా అన్ని జిల్లాల్లో పారిశుద్ధ్యం పడకేసింది.

మరోవైపు పంచాయతీలకు నిధులు విడుదల చేయయపోవడంతో గ్రామాలు మురికికూపాలుగా మారుతున్నాయి. సొంత జేబుల నుంచి ఖర్చు చేస్తూ వచ్చిన పంచాయతీ కార్యదర్శులు ఇక తమ వల్ల కాదని సామూహికంగా సెలవులు పెడుతున్నారు, విధులకు దూరంగా ఉంటున్నారు.

ప్రభుత్వ సమీక్షలు లేక, నిధులు విడుదల చేయక, పారిశుద్ధ్య నిర్వహణ జరగకపోవడంతో దోమలు విజృంభించి విష జ్వరాలు వ్యాప్తి చెందుతున్నాయి. పల్లె, పట్టణం అన్న తేడా లేకుండా అన్ని ప్రాంతాల్లో జ్వరాల బారిన పడుతున్నారు. ప్రతి రెండు ఇండ్లలో ఒకరు వైరల్ ఫీవర్ తో బాధపడుతున్నారు.

ఆసుపత్రుల్లో పడకలు దొరకని పరిస్థితి వచ్చిందంటే రాష్ట్రంలో సీజనల్ వ్యాధుల వ్యాప్తి ఎలా ఉందో అర్థం చేసుకోవచ్చు. ఇంత జరుగుతున్నా ప్రభుత్వం చర్యలకు ఉపక్రమించడం లేదు. మొద్దు నిద్ర వీడటం లేదు. పరిపాలనను గాలికి వదిలేసిన కాంగ్రెస్ ప్రభుత్వం కేవలం రాజకీయాలు చేయడం, ప్రతిపక్ష నాయకుల మీద బురద జల్లడానికే ప్రాధాన్యమిస్తున్నది.

ప్రభుత్వం ఇప్పటికైనా కళ్లు తెరిచి పారిశుద్ధ్య నిర్వహణ, ఆసుపత్రుల సన్నద్ధత వంటి ముఖ్యమైన అంశాలపై తక్షణం ఉన్నత స్థాయి సమీక్ష నిర్వహించి వైరల్ ఫీవర్స్ బారిన పడి ప్రజలు ప్రాణాలు కోల్పోకుండా చూడాలని ప్రభుత్వాన్ని బీఆర్ఎస్ పార్టీ పక్షాన డిమాండ్ చేస్తున్నాం.” అని పేర్కొన్నారు.




# దేశం కోసం పనిచేసే పార్టీ బీజేపీ

- సభ్యత్వ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలి
- బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు, కేంద్రమంత్రి కిషన్ రెడ్డి

**బలగం టీవీ, హైదరాబాద్**

వ్యక్తుల కోసం కాకుండా దేశం కోసం పనిచేసే పార్టీ అని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు, కేంద్రమంత్రి కిషన్ రెడ్డి అన్నారు. నాంపల్లి కేంద్ర కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కార్యకర్తలందరూ సభ్యత్వ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ప్రపంచంలోనే అత్యధిక సభ్యులు కలిగిన పార్టీ బీజేపీ అని తెలిపారు.పార్టీ మరింత బలపడేందుకు సభ్యత్వ నమోదు చేయాలని కిషన్ రెడ్డి అన్నారు. పార్లమెంట్ ఎన్నికల్లో వచ్చిన ఓట్లను దృష్టిలో పెట్టుకొని సభ్యత్వ నమోదు చేయాలని సూచించారు. ప్రతి కార్యకర్త వంద మందిని సభ్యులుగా చేర్పించాలని కోరారు. సభ్యత్వ నమోదును ఒక ఉద్యమంలాగా చేయాలని పిలుపునిచ్చారు. అత్యధిక సభ్యత్వం కలిగిన పార్టీగా బీజేపీ గిన్నిస్ బుక్ రికార్డుల్లోకి ఎక్కిందని, 2024 సభ్యత్వ నమోదులో మన రికార్డును మనమే బ్రేక్ చేసుకోవాలంటూ కార్యకర్తలకు పిలుపునిచ్చారు. ఒక వైపు సభ్యత్వ నమోదు మరో వైపు రైతాంగ సమస్యలపై పోరాటం చేయాలని పార్టీ శ్రేణులకు సూచించారు.

తెలంగాణలో బీజేపీ అధికారంలోకి రావాలని ప్రజలు ఆకాంక్షిస్తున్నారన్నారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో విజయం సాధించాలని, దీనికి సభ్యత్వం కీలకమని తెలిపారు. ఆన్ లైన్ సభ్యత్వం తీసుకోవాలని నిర్ణయమన్నారు. పార్లమెంట్ ఎన్నికల్లో బీజేపీకి 77లక్షల ఓట్లు వచ్చాయని చెప్పారు. వేలాది బూత్ లలో బీజేపీ నంబర్ వన్ గా నిలిచిందని పేర్కొన్నారు. కాంగ్రెస్ ఆరు గ్యారంటీలు ఇచ్చి అధికారంలోకి వచ్చి వాటికి తూట్లు పొడుస్తుందన్నారు.

బీఆర్ఎస్ ఏ విధంగా ప్రజలను మోసం చేసిందో, అలాగే కాంగ్రెస్ కూడా మోసం చేస్తోందని విమర్శించారు.రాష్ట్రంలో 50శాతం కూడా రుణమాఫీ జరగలేదని కిషన్‌రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. రుణమాఫీపై వాస్తవ పరిస్థితులు బయట పెట్టాలని, లేకుంటే ఆ వివరాలు బీజేపీయే బయట పెడుతుందన్నారు. ఏ గ్రామంలో రుణమాఫీ పూర్తిగా కాలేదని చెప్పారు. సెప్టెంబర్ 17న ‘హైదరాబాద్ ముక్తి దివస్’ కార్యక్రమం చేస్తామని వెల్లడించారు.

# మహిళా భద్రతపై మంత్రి సీతక్క సమీక్ష



**బలగం టీవీ, హైదరాబాద్**

మహిళా భద్రతపై మంత్రి సీతక్క బుధవారం సచివాలయంలో సమీక్ష నిర్వహించారు. మహిళా కమీషన్ చైర్ పర్సన్ నేరెళ్ల శారద, మహిళా సహకార అభివృద్ధి కార్పోరేషన్ చైర్ పర్సన్ బంద్రు శోబారాణి, మహిళా శిశు సంక్షేమ శాఖ కార్యదర్శి వాకాటి కరుణ, కమిషనర్ కాంతి వెస్లీ, ఉమేన్ సేఫ్టి డీజీ శిఖా గోయల్, ఐజీ రెమా రాజేశ్వరి, సీనియర్ మహిళా ఐఏఎస్ లు అనితా రామచంద్రన్, శైలజా రామయ్యార్, ఐ అండ్ పీఆర్ కమిషనర్ హనుమంత రావు హాజరయ్యారు.

ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ “మహిళల్లో ఉన్న అభద్రత భావాన్ని పోగొట్టేలా ప్రత్యేక చర్యలు చేపడుతున్నాం .మహిళలకు రక్షణ, సామాజిక భద్రత కల్పించేలా మా ప్రభుత్వం కృషి చేస్తోంది. శిక్ష, శిక్షణ ఏకకాలంలో అమలయితేనే క్రైమ్ రేట్ తగ్గుతుంది. మహిళల మీద దాడులు జరిగితే సత్వర న్యాయం జరిగేలా చర్యలు తీసుకుంటాం .అమ్మాయిలను, మహిళలను గౌరవించేలా ప్రజల్లో అవగాహన పెంచుతాం. మహిళలపై హింస పెరగడానికి డ్రగ్స్, గంజాయి కూడా కారణమవుతున్నాయి. వాటి కట్టడి కోసం ఇప్పటికే ప్రభుత్వం ఎన్నో చర్యలు చేపట్టింది . మత్తు బానిసలపై నిఘ పెంచుతాం. ఆస్పత్రుల్లో పని చేసే డాక్టర్లు కూడా అభద్రతాభావం లో ఉండటం బాధాకరం. మహిళా డాక్టర్లకు భరోసా కల్పించాల్సిన బాధ్యత ప్రభుత్వాలపై ఉంది

మంత్రులు, ఉన్నతాధికారులతో త్వరలో కోర్ కమిటీ ఏర్పాటు చేస్తాం. అన్ని శాఖల్లో త్వరలో ఉమెన్ సేఫ్టీ కమిటీలు వేస్తాం. మహిళా భద్రత కోసం ప్రతి శాఖకు ప్రత్యేక బడ్జెట్ కేటాయించే అంశాన్ని పరిశీలిస్తున్నాం. అమ్మాయిలు మహిళల భద్రత మీ బాధ్యత అని అన్ని విద్యాసంస్థలకు తెలియ చెబుతాం . అమ్మాయిలను, మహిళలను గౌరవించేలా పాఠశాలల్లో పాఠాలు బోధిస్తాం. పబ్లిక్ ప్లేసుల్లో ఆసుపత్రిలో సీసీ కెమెరాలను పెంచేలా చర్యలు చేపడతాం. మహిళా భద్రత కోసం మా ప్రభుత్వం ప్రారంభించిన టి సేఫ్ యాప్ బాగా పనిచేస్తుంది. టి సేఫ్ యాప్ ఇతర రాష్ట్రాలకు ఆదర్శంగా మారింది. ఈ యాప్ ను ప్రారంభించేందుకు ఏడు రాష్ట్రాలు ముందుకొచ్చాయి. టి సేఫ్ యాప్ కు మరింత ప్రచారం కల్పిస్తాం. ఆటోలు, క్యాబ్ ల్లో టి సేఫ్ నెంబర్లను ప్రచారం చేస్తాం. మహిళా భద్రత కోసం తీసుకోవాల్సిన చర్యలపై సమగ్ర నివేదికను త్వరలో సీఎంకు సమర్పిస్తాం



# అందుబాటులో అన్ని వైద్య సేవలు..

- చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం

బలగం టీవీ ,బోయినపల్లి

ప్రజలందరికీ అందుబాటులో అన్ని వైద్య సేవలు అందించే దిశగా రాష్ట్ర ప్రభుత్వం ముందుకు వెళ్తుందని చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం అన్నారు. బుధవారం బోయినపల్లి మండలం కోరెం గ్రామంలో రూ. 20 లక్షలతో నిర్మిస్తున్న హెల్త్ సబ్ సెంటర్ భవనంకు ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం భూమి పూజ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం మాట్లాడుతూ రాష్ట్ర ప్రజలకు మెరుగైన వైద్యం అందించడమే తమ ప్రభుత్వ లక్ష్యమని, ఇందులో భాగంగానే నూతనంగా ఆసుపత్రులకు భవనాలు నిర్మిస్తుందని అన్నారు . ప్రభుత్వ వైద్య దవాఖానల్లో అన్ని సేవలు కొనసాగుతున్నాయని, ప్రజలు వినియోగించు కోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ చెన్నాడి సుధాకర్ రావు, డీఎంహెచ్ఓ వసంతరావు, పంచాయతీరాజ్ అధికారులు, వైద్యులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# సీజనల్ వ్యాధుల పట్ల సిబ్బంది నిత్యం అప్రమత్తంగా ఉండాలి

- ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలి..
- కలెక్టర్ సందీప్ కుమార్ ఝా



బలగం టీవీ , సిరిసిల్ల:

సీజనల్ వ్యాధుల పట్ల సిబ్బంది నిత్యం అప్రమత్తంగా ఉండాలని,ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలనీ, దవాఖానకు వచ్చే రోగులకు సంబంధించిన అన్ని వైద్య పరీక్షలు వైద్యం ఇక్కడే అందించాలని కలెక్టర్ సందీప్ కుమార్ ఝా ఆదేశించారు. బుధవారం ముస్తాబాద్ మండలం పోత్గల్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ( పీహెచ్ సీ)ను కలెక్టర్ సందీప్ కుమార్ ఝా ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ రక్త పరీక్షలు చేసే ల్యాబ్, ఫార్మసీ, వాక్సినేషన్ రూం, ఓపీ చెక్ చేసే గదిని, ఓపీ రిజిస్టర్ ను పరిశీలించి, రోజు ఎంత మంది రోగులు హాస్పిటల్ కు వస్తున్నారో డాక్టర్ ను అడిగి తెలుసుకున్నారు.అనంతరం కలెక్టర్ సందీప్ కుమార్ ఝా మాట్లాడుతూ వర్షాల నేపథ్యంలో సీజనల్ వ్యాధులు ప్రబలే ప్రమాదము ఉందని, వైద్యులు, సిబ్బంది నిత్యం అప్రమత్తంగా ఉండాలని అన్నారు . అన్ని రకాల సీజనల్ జ్వరాలకు సంబంధించిన రక్తం పరీక్షలు ఇక్కడే చేయాలని, కావాల్సిన కిట్లు, పరికరాలు అందజేస్తామని తెలిపారు.

కుక్క, కోతి దాడులతో వచ్చే వారి వివరాలు ఎప్పటికప్పుడు పంపించాలని ఆదేశించారు. వ్యక్తిగత, పరిసరాల పరిశుభ్రత పై అందరికీ అవగాహన కల్పించాలని అన్నారు.

అనంతరం గూడెంలోని ఆయుష్మాన్ భారత్ ఆరోగ్య కేంద్రాన్ని కలెక్టర్ సందీప్ కుమార్ ఝా తనిఖీ చేశారు. ఓపీ రిజిస్టర్ తనిఖీ చేసి, రోజు ఎందరు రోగులు వస్తున్నారని, సీజనల్ వ్యాధుల వ్యాప్తి పై అడిగి తెలుసుకున్నారు. అక్కడి నుంచి సమీపంలోని అంగన్వాడీ కేంద్రానికి చేరుకొని, పిల్లల హాజరు రిజిస్టర్ ను, వారికి అందిస్తున్న ఆహార పదార్థాలు పరిశీలించారు.ఈ కార్యక్రమం లో పోత్గల్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యురాలు గీతాంజలి, వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# సీఎం రేవంత్ రెడ్డిని నమ్ముతా.. ఖర్గేను నమ్మను

- ఎస్సీ ఉపకులాల రిజర్వేషన్‌పై సుప్రీంకోర్టు తీర్పుపై సోనియా, రాహుల్ ఎందుకు స్వాగతించలేదు
- మోడీకి మనువాదంతోపాటు మానవతా వాదం
- నేను ఏ పార్టీలో చేరడం లేదు
- మాదిగలకు అన్యాయం జరిగినట్లు కోర్టులు, సమాజం, కమిషన్ నిర్ధారించాయి
- ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపకుడు మంద కృష్ణ మాదిగ



బలగం టీవి, హైదరాబాద్

' సీఎం రేవంత్ రెడ్డిని కొంత నమ్ముతా కానీ, మల్లికార్జున ఖర్గేను నమ్మను. వర్గీకరణకు అడ్డుపడుతుంది ఆయనే' అని ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపకుడు మంద కృష్ణ మాదిగ అన్నారు. అన్ని వర్గాల మద్దతు ఎస్సీ వర్గీకరణకు ఉందని, దాన్ని వ్యతిరేకించడం మానుకొని ఉమ్మడి సమస్యలపై పోరాటానికి కలిసి రావాలన్నారు. కోర్టులు, సమాజం, కమిషన్‌లు మాదిగలకు అన్యాయం జరిగినట్లు నిర్ధారించాయన్నారు. అందరికీ రిజర్వే షన్లు అందక అసమానతలు వచ్చాయన్నారు. కొందరు స్వార్థపరులు తప్ప అందరూ వర్గీకరణ కోరుతూ మద్దతు ఇచ్చారని తెలిపారు. మాదిగలకు అన్యాయం జరిగినట్లు కోర్టులు, సమాజం, కమిషన్ నిర్ధారించాయని ఎమ్మార్పీఎస్ తెలిపారు. రిజర్వేషన్లు అందరికీ అందక అసమానతలు వచ్చాయని అన్ని కమిషన్లు ప్రకటించాయని ఆయన గుర్తుచేశారు. హైదరాబాద్ సోమాజిగూడ ప్రెస్ క్లబ్‌లో తెలంగాణ జర్నలిస్టు యూనియన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన "క్రాస్ టాక్ విత్ మంద కృష్ణమాదిగ" కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు.

1998లో చంద్రబాబు ప్రభుత్వ హయాంలో ఎస్సీ వర్గీకరణ కోసం తీర్మానం జరిగితే అన్ని పార్టీలు మద్దతిచ్చాయన్న మందకృష్ణ మాదిగ ప్రత్యేక రాష్ట్రంలో కేసీఆర్ తీర్మానం చేసి కేంద్రానికి పంపారని గుర్తు చేశారు. వ్యతిరేకించే కొందరు స్వార్థపరులు తప్ప అందరూ వర్గీకరణ కోరుతూ ఎమ్మార్పీఎస్‌కు మద్దతు ఇచ్చారని తెలిపారు. సుప్రీంకోర్టు చీఫ్ జస్టిస్ ఆధ్వర్యంలో ఏడుగురు న్యాయమూర్తుల బృందం అనుకూలంగా తీర్పు ఇచ్చిం దని, న్యాయం ఇవ్వడంలో జస్టిస్ చంద్రచూడ్‌ను మించిన వారు లేరని కొనియాడారు. అందరి మద్దతు ఉండటంతోనే ఎమ్మార్పీఎస్ 30 ఏళ్లు నిలబడిందని స్పష్టం చేశారు.

హర్షకుమార్ లాంటి నేతలకు వారి కులంలోనే విలువ లేదని విమర్శించారు. ఆర్టికల్ 341 ద్వారా పార్లమెంటులో బిల్లు పెట్టమని అంటున్నారని ఆక్షేపించారు. సోనియా, రాహుల్ అందరినీ తాను కలిశానని, బిల్లు పెట్టొద్దని అడ్డం పడ్డది ఆయనే కదా అని ధ్వజమెత్తారు. మాల మేధావులు ఎందుకు మౌనంగా ఉన్నారని ప్రశ్నించారు.

వర్గీకరణకు వ్యతిరేకమైతే బయటకు రావాలని మందకృష్ణ కోరారు. వారంతా ముమ్మాటికీ మనువాదులేనని ఆక్షేపించారు. ఎస్సీ వర్గీకరణకు సపోర్టు చేసిన వారికి తన మద్దతు ఉంటుందన్నారు. సీఎం రేవంత్‌రెడ్డికి గతంలో జరిగిన ఎన్నికల్లో మద్దతు ఇచ్చామని చెప్పారు. ఏపీ సీఎం చంద్రబాబు వల్లనే తమకు మేలు జరిగిందన్నారు. ఇతర రాష్ట్రాల కంటే ముందే అమలు చేస్తామని చెప్పిన సీఎం రేవంత్‌రెడ్డికి ధన్యవాదాలు తెలియజేశారు. చట్ట సభలకు వెళ్లి గొంతెత్తాలని ఎవరికైనా ఉంటుందన్న మందకృష్ణ.. తాను 2004, 2009, 2014లో ఎన్నికల్లో ఇండిపెండెంట్‌గా పోటీ చేసి ఓడిపోయానన్నారు.

ఎస్సీ ఉపకులాల రిజర్వేషన్‌పై సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పుపై సోనియా, రాహుల్ ఎందుకు స్వాగతించలేదని ప్రశ్నించారు. తెలంగాణలో రేవంత్, కర్ణాటకలో సిద్దరామయ్య స్వాగతించారు. కానీ, ఖర్గే మాత్రం వ్యతిరేకించారని ఆయనను వదిలిపెట్టం జాతీయ స్థాయిలో చూసుకుంటామని హెచ్చరించారు. నరేంద్రమోడీ ప్రభుత్వం అటార్నీ జనరల్ ద్వారా తమకు అండగా ఉందన్నారు. ఈ తీర్పులో కేంద్రం భాగస్వామ్యం ఉందని సంతోషం వ్యక్తం చేశారు. మోడీకి మనువాదంతోపాటు మానవతా వాదం కూడా ఉందంటూ కృష్ణమాదిగ కితాబిచ్చారు. వర్గీకరణ పూర్తయ్యే వరకు నియామకాలు చేపట్టొద్దన్నారు.

### నేను ఏ పార్టీలో చేరడం లేదు

నేను ఏ పార్టీలో చేరడం లేదని.. అది ఎప్పుడూ ఉండే ప్రచారమేనని మందకృష్ణ మాదిగ అన్నారు. మనమంతా ఏకం కావాలని, అన్ని వర్గాలకు సమానంగా పోరాడాలని అన్నారు. వర్గీకరణకు వ్యతిరేకంగా స్టేట్మెంట్స్ ఇవ్వడం ఆపాలని, మాలల్లో అంబేద్కరిస్టులు లేరు కానీ వారు అంబేద్కర్ పేరు చెప్పుకుంటున్నారని అన్నారు. అయితే మాలల్లో ఒకటి రెండు శాతం వరకూ తనకు సపోర్ట్ చేసే వాళ్ళు ఉన్నారని చెప్పుకొచ్చారు. మాలల్లో మనువాదులు పెరిగారని, వాళ్లు విప్లవాలు చేసినవారు కాదని పేర్కొన్నారు. అయితే తాను ఏ పార్టీలో చేరడం లేదని, అది ఎప్పుడూ ఉండే ప్రచారమేనని అన్నారు. ఇలాంటి ప్రచారం నిన్న మొన్నటి నుండి జరుగుతుంది కాదని, 1997 జూన్ లో కూడా పెద్ద ఎత్తున ప్రచారం జరిగిందని తెలిపారు. తాను ఎప్పటికీ ప్రజల మనిషినేనని, ప్రజల తరపున పోరాటం చేయడానికే తాను ఉన్నట్లు తెలిపారు. ఒకప్పుడు చంద్రబాబు నాయుడు ఎంపీ టికెట్ ఇచ్చాడు, రాజ్యసభ కూడా ఇస్తానన్నారు. అయితే తాను తిరస్కరించినట్లు చెప్పారు. తర్వాత రాజశేఖర్ రెడ్డి హయాంలో కూడా తాను కాంగ్రెస్ లో చేరుతానని అనుకున్నారు. కానీ ఏ పార్టీలో చేరలేదని అన్నారు. ఎప్పటికీ తనది నల్ల కండువానే అని, అదే తన జీవితమని, దాన్ని ఎప్పటికీ వదిలిపెట్టనని వెల్లడించారు. తాను ఇదివరకు ఇండిపెండెంట్ గా పోటీ చేసి ఓడిపోయానని, కానీ ఏ పార్టీలో కూడా చేరలేదని అన్నారు. స్వతంత్రంగా పోటీ చేసి గెలిచి, చట్ట సభల్లోకి వెళ్తాను కానీ ఏ పార్టీలో కూడా చేరబోనని, తన స్వేచ్ఛను ఎప్పటికీ కోల్పోనని మందకృష్ణ చెప్పుకొచ్చారు.

# ఫార్మారంగం సమస్యలను పరిష్కరించాలి

- కేంద్రమంత్రి నడ్డాకు రాష్ట్ర మంత్రి శ్రీధర్ బాబు లేఖ



బలగం టీవి, హైదరాబాద్

ఫార్మారంగం ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని కోరుతూ కేంద్రమంత్రి నడ్డాకు బుధవారం మంత్రి శ్రీధర్ బాబు లేఖ రాశారు. ప్రపంచానికి భారత్ ఫార్మాసిటీగా మారిందన్నారు. డ్రగ్స్ అభివృద్ధి తయారీ, పరిశోధనలకు హైదరాబాద్ ఉందని, ఫార్మాస్యూటికల్, లైఫ్ సైన్సెస్ హబ్‌గా ప్రపంచవ్యాప్తంగా గుర్తింపు పొందిందని శ్రీధర్ బాబు తెలిపారు. భౌగోళిక రాజకీయ పరిణామాలు సాధారణంగా ఔషధ రంగంలో ముఖ్యంగా ఔషధ సేవల రంగం కాంట్రాక్ట్ రీసెర్చ్ ఆర్గనైజేషన్స్(సీఆర్ఓఎస్), కాంట్రాక్ట్ డెవలప్‌మెంట్ అండ్ మ్యానుఫ్యాక్చరింగ్ ఆర్గనైజేషన్స్ రంగం(సీడీఎంఓ)లలో అపారమైన అవకాశాలను సృష్టించాయన్నారు. ఇతర వాటిలో, యూఎస్ ప్రభుత్వ బయోసెక్యూర్ చట్టం భారతీయ ఫార్మా సేవల పరిశ్రమకు మంచి అవకాశాలను సృష్టించిందని తెలిపారు. పరిశోధన, క్లినికల్ ట్రయల్స్ నుండి తయారీ, నియంత్రణ సమర్పణల వరకు మొత్తం డ్రగ్ డెవలప్‌మెంట్ లైఫ్ సైకిల్ కి అవసరమైన సేవలను అందించడం ద్వారా ప్రపంచవ్యాప్తంగా సీఆర్ఓఎస్ మరియు సీడీఎంఓ కీలక పాత్ర పోషిస్తాయన్నారు. ఈ రెండు ఏటా 10.75% వృద్ధిని నమోదు చేస్తోందని, 2030 నాటికి 2.5 బిలియన్ డాలర్లకు చేరుకుంటుందన్నారు. కొన్ని నియంత్రణ విధానాలను క్రమబద్ధీకరిస్తే ఈ విభాగంలో ప్రపంచ అగ్రగామిగా ఎదగడానికి మరియు బిలియన్ డాలర్ల పెట్టుబడులను ఆకర్షించడానికి భారత్ గమ్య స్థానం అవుతుందని వెల్లడించారు. ఫార్మాస్యూటికల్స్, లైఫ్ సైన్సెస్ రంగం వృద్ధికి తెలంగాణ కట్టుబడి ఉందని, అవకాశాలు మరియు సవాళ్లను అధిగమించేందుకు, వృద్ధిని వేగవంతం చేయడానికి అవసరమైన మద్దతు కోసం తాను పరిశ్రమతో అనేక చర్చలు జరిపానన్నారు. డ్రగ్స్ తయారీ కోసం లైసెన్స్ విధానం సులభతరం చేయాలని, ఔషధాల ఎగుమతుల సమయంలో పేర్ల గోప్యత పాటించాలని, ల్యాబ్ కెమికల్స్‌పై కస్టమ్స్ సుంకం తగ్గించాలని, లైసెన్స్ జారీ కోసం స్థిరత్వ డేటా అవసరాలను సానుకూల పర్చడం పలు అంశాలను లేఖలో పేర్కొన్నారు. సానుకూలంగా స్పందించి ఫార్మారంగం అభివృద్ధికి సహకరించాలని కోరారు.

### సినిమాల్లో నటించేందుకు

# ప్రభుత్వం నుంచి అనుమతి కోరాను

- కేంద్ర మంత్రి సురేష్ గోపి



బలగం టీవి, హైదరాబాద్

ఒట్టకొంబన్ చిత్రంలో నటించేందుకు ప్రభుత్వం నుంచి అనుమతి కోరానని, ఇంకా అది అందలేదని మలయాళ సినీ నటుడు, కేంద్ర సహాయ మంత్రి సురేష్ గోపి అన్నారు. అయితే సెప్టెంబర్ 6 నుంచి తాను షూటింగ్‌లో పాల్గొంటున్నట్లు ఆయన ప్రకటించారు.

బుధవారం కేరళ ఫిల్మ్ చాంబర్ ఆఫ్ కామర్స్ నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. 20 నుంచి 22 చిత్రాలకు సంబంధించిన కథలు విని వాటిలో నటించడానికి అంగీకరించానని ఆయన వెల్లడించారు. సినిమాల్లో నటించడానికి కేంద్ర హెూం మంత్రి అమిత్ షాను కోరితే ఎన్ని చిత్రాలలో అని ఆయన అడిగారని సురేష్ గోపి తెలిపారు. తాను 22 సినిమాలు అని చెప్పినపుడు అమిత్ షా తన అభ్యర్థనను పక్కనపెట్టేశారని ఆయన తెలిపారు. అయితే అనుమతి ఇస్తానని మాత్రం ఆయన చెప్పారన్నారు.

తాను సినిమా షూటింగ్‌లో ఉన్నపుడు తన మంత్రివర్గ బాధ్యతల నిర్వహణ కోసం తన మంత్రిత్వ శాఖ నుంచి ముగ్గురు, నలుగురు అధికారులను ఇక్కడకు తెచ్చుకుంటానని, సినిమా సెట్స్‌లో ఇందుకోసం ప్రత్యేక ఏర్పాట్లు చేసుకుంటానని సురేష్ గోపి వివరించారు. తాను చేయాల్సింది ఇదేనని, ఒకవేళ కేంద్ర మంత్రి పదవి నుంచి తనను తొలగిస్తే బతికిపోయానని భావిస్తానని, ఇంతకు మించి తాను చెప్పలేనని ఆయన వ్యాఖ్యానించారు.

మంత్రి పదవిని తాను ఆశించలేదని, ఇప్పటికీ తనకు ఆ కోరిక లేదని అన్నారు. మంత్రి పదవిని ఇస్తున్నామని పార్టీ ఈనాయకత్వం చెప్పినపుడు వారి ఆజ్ఞను శిరసావించానని, తనను గెలిపించిన త్రిసూర్ ప్రజల కోసమే దీన్ని అంగీకరించానని ఆయన అన్నారు. పార్టీ నాయకుల ఆదేశాలను ఇప్పటికీ గౌరవిస్తానని, అయితే సినిమా(నటన) లేకపోతే తాను చనిపోయినట్లేనని ఆయన వ్యాఖ్యానించారు.

# తెలంగాణలో ఎస్సీ వర్గీకరణను అమలు చేయండి

బలగం టీవీ , హైదరాబాద్

ఎస్సీ వర్గీకరణపై భారత అత్యున్నత న్యాయస్థానం సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పు తెలంగాణ రాష్ట్రంలో త్వరితగతిన అమలు చేయాలని రాష్ట్ర వైద్యారోగ్య, కుటుంబ సంక్షేమ శాఖల మంత్రి దామోదర్ రాజనర్సింహను ఎమ్మార్పీఎస్ వ్యవస్థా పక అధ్యక్షులు మందకృష్ణ మాదిగ కోరారు. ఎస్సీ వర్గీకరణపై భారత అత్యున్నత న్యాయస్థానం సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పు తెలంగాణ రాష్ట్రంలో త్వరితగతిన అమలు చేయాలని రాష్ట్ర వైద్యారోగ్య, కుటుంబ సంక్షేమ శాఖల మంత్రి దామోదర్ రాజనర్సింహతో ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షులు మందకృష్ణ మాదిగ, మాదిగ సామాజిక వర్గానికి చెందిన శాసనసభ్యులు, ప్రభుత్వ విప్ అడ్లూరి లక్ష్మణ్ కుమార్, డా. కవ్వంపల్లి సత్యనారాయణ, వేముల వీరేశం, కాలే యాదయ్య, మందుల శామ్యూల్ సమావేశమయ్యారు.

ఈ సమావేశంలో ఎస్సీ వర్గీకరణ అమలుపై సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పును రాష్ట్రంలో త్వరితగతిన అమలయ్యేలా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డితో చర్చించాలని శాసనసభ్యులు, దళిత మేధావులు, సామాజికవేత్తలు రాష్ట్ర మంత్రి దామోదర్ రాజనర్సింహకు విజ్ఞప్తి చేశారు. శాసనసభ్యులు, మాదిగ సామాజిక వర్గానికి చెందిన మేధావులు, సామాజికవేత్తలు చేసిన విజ్ఞప్తిపై మంత్రి దామో దర్ రాజనర్సింహ సానుకూలంగా స్పందించారు. ఎస్సీ వర్గీకరణ అమలుపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డితో చర్చిస్తామన్నారు. ఎస్సీ వర్గీకరణపై సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పు రాష్ట్రంలో అమలుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు.ఈ సమావేశంలో మాదిగ సామాజిక వర్గానికి చెందిన మేధావులు ప్రొఫెసర్ మల్లేశం, ప్రొఫెసర్ ఖాసీం, సీనియర్ కాంగ్రెస్ పార్టీ నాయకులు కొండేటి మల్లయ్య, విజయ్ కుమార్ ముంజగళ్ళ, బాపిరాజు, ఎమ్మార్పీఎస్ నాయకులు మేడి పాపయ్య మాదిగ, గోవింద్ నరేష్‌లు పాల్గొన్నారు.

### స్కూల్ బస్సులో విద్యార్థులు..


# నిప్పు పెట్టేందుకు యత్నం..



బలగం టీవీ , పాట్నా

భారత్ బంద్ సందర్భంగా విద్యార్థులున్న స్కూల్ బస్సుకు నిప్పు పెట్టేందుకు ఆందోళనకారులు ప్రయత్నించారు. అయితే కాలుతున్న టైర్ మీదుగా ఆ స్కూల్ బస్సు వెళ్లింది. పిల్లలకు తృటిలో ప్రమాదం తప్పింది. ఈ షాకింగ్ వీడియో క్లిప్ సోషల్ మీడియాలో వైరల్ అయ్యింది. బీహార్ రాజధాని పాట్నాలో ఈ సంఘటన జరిగింది. ఎస్సీ, ఎస్టీ రిజర్వేషన్లలో ఉప వర్గీకరణకు సంబంధించి ఇటీవల సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పుపై వ్యతిరేకంగా బుధవారం దేశ వ్యాప్తంగా బంద్‌కు ఆ వర్గాలు పిలుపునిచ్చాయి.కాగా, పాట్నాలోని గోపాల్‌గంజ్ ప్రాంతంలో గందరగోళం నెలకొన్నది. విద్యార్థులతో వెళ్తున్న స్కూల్ బస్సు అద్దాలను ఆందోళనకారులు ధ్వంసం చేశారు. అలాగే స్కూల్ బస్సుకు నిప్పు పెట్టేందుకు ప్రయత్నించారు. బస్సును అడ్డుకుని కాలుతున్న టైర్‌ను వాహనం కిందకు నెట్టారు. అయితే స్కూల్ బస్సు ముందుకు వెళ్లడంతో అందులో ఉన్న పిల్లలకు తృటిలో ప్రమాదం తప్పింది. ఈ వీడియో క్లిప్ సోషల్ మీడియాలో వైరల్ అయ్యింది. దీంతో ఆందోళనకారుల తీరుపై నెటిజన్లు ఆగ్రహం వ్యక్తం చేశారు. వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

# ఓటుకు నోటు కేసులో రెండు పిటిషన్లు డిస్మిస్



బలగం టీవీ , న్యూఢిల్లీ

ఓటుకు నోటు కేసులో రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుకు భారీ ఊరట లభించింది. ఓటుకు నోటు కేసులో చంద్రబాబును నిందితుడిగా చేర్చాలని, కేసు దర్యాప్తును సీబీఐకి అప్పగించాలని వైసీపీ నేత ఆళ్ల రామకృష్ణారెడ్డి (ఆర్కె) దాఖలు చేసిన రెండు పిటిషన్లను ధర్మాసనం డిస్మిస్ చేసింది. రాజకీయ కక్ష సాధింపులకు న్యాయస్థానాన్ని వేదికగా చేర్చుకోవద్దంటూ పిటిషనరు రామకృష్ణారెడ్డిని జస్టిస్ సుందరేశ్ ధర్మాసనం మందలించింది. ఈ కేసుతో ఎటువంటి సంబంధం లేని, సాక్షి, బాధితుడు కాని వైసీపీ నేత ఆర్కె, ఈ కేసులో ఛార్జ్‌షీట్ దాఖలు అయినప్పటికీ, మళ్లీ ఫ్రెష్‌గా విచారణ జరపి, చంద్రబాబును నిందితుడిగా చేర్చాలని కోరతూ లోయర్ కోర్టు (ఏసీబీ కోర్టు)లో ప్రైవేట్ పిటిషన్ దాఖలు చేశారు.దీనిపై విచారించిన ఎసిబి కోర్టు, ఆర్కెకు అనుకూలంగా ఫ్రెష్‌గా విచారణ జరపాలని ఏసీబీని ఆదేశిస్తూ తీర్పు ఇచ్చింది. దీనిపై తెలంగాణ హైకోర్టును చంద్రబాబు ఆశ్రయించారు. విచారణ జరిపిన హైకోర్టు, ఎసిబి తీర్పును పక్కన పెట్టింది. తెలంగాణ హైకోర్టు తీర్పును సవాల్ చేస్తూ ఆర్కె సుప్రీంకోర్టును ఆశ్రయించారు. దీంతో పాటు ఈ కేసు విచారణ సిబిఐకి అప్పగించాలని కోరుతూ పిటిషన్లు దాఖలు చేశారు. ఈ రెండు పిటిషన్లను బుధవారం విచారణ జరిపిన జస్టిస్ సుందరేశ్, జస్టిస్ అరవింద్ కుమార్ ధర్మాసనం డిస్మిస్ చేసింది.

2015లో తెలంగాణ ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రిగా ఉన్న చంద్రబాబు, తెలంగాణలో అప్పటి టీడీపీ ఎమ్మెల్యే, ప్రస్తుత తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ద్వారా నామినేటెడ్ ఎమ్మెల్యే స్టీఫెన్‌సన్‌ను కొనుగోలుకు డబ్బులిచ్చినట్లు వీడియో ఫుటేజ్ బయటకు వచ్చింది. అలాగే స్టీఫెన్‌సన్‌తో చంద్రబాబు ఫోన్‌లో మాట్లాడిన ఆడియో రికార్డులు కూడా బయటకు వచ్చాయి. ఈ కేసులో రేవంత్ రెడ్డి జైలుకూ వెళ్లారు.

# యువకుడిపై కత్తితో దాడి

బలగం టీవీ , అమరావతి

ఏపీ ఏలూరు జిల్లా టి.నరసాపురం మండలంలో 'భారత్ బంద్' కార్యక్రమంలో దారుణం చోటుచేసుకుంది. ఎస్సీ వర్గీకరణను వ్యతిరేకిస్తూ పలు దళిత సంఘాల నాయకులు బంధంచర్ల గ్రామంలో పర్యటించారు. షాపులు మూసేసి బంద్‌కు సహకరించాలని కోరారు. ఈ క్రమంలో స్థానిక హెూటల్ యజమానితో నిరసన చేస్తున్న ఓ యువకుడికి వాగ్వాదం చెలరేగింది. దీంతో హెూటల్ యజమాని కత్తితో అతనిపై దాడి చేశాడు. బాధితుడిని ఆస్పత్రికి తరలించారు.

# తడబడి నిలబడిన పాకిస్తాన్

- బంగ్లాదేశ్‌తో తొలిటెస్టు
- మొదటి రోజు

### ముగిసేసరికి పాకిస్తాన్ 158/4



బలగం టీవీ , రావల్పిండి

బంగ్లాదేశ్‌తో జరుగుతున్న తొలిటెస్ట్‌లో పాకిస్తాన్‌జట్టు తడబడి నిలబడింది. టాస్ గెలిచి తొలిగా బ్యాటింగ్‌కు దిగిన పాకిస్తాన్ తొలిరోజు ఆట ముగిసే సమయానికి 4వికెట్ల నష్టానికి 158పరుగులు చేసింది. 16పరుగులకే మూడు వికెట్లు కోల్పోయి పీకల్లోతు కష్టాల్లో పడ్డ జట్టును సైమ్ ఆయుబ్(56), షకీల్(57) అర్ధసెంచరీలతో ఆదుకున్నారు. వీరిద్దరూ 4వ వికెట్‌కు 98పరుగులు జతచేసి ఆదుకున్నారు. తొలిరోజు ఆట చివరిరోజు ఓపెనర్ ఆయుబ్ (56) ఔట్ కాగా.. వికెట్ కీపర్ రిజ్వాన్(24) ధనా ధన్ బ్యాటింగ్‌తో రాణించాడు. క్రీజ్‌లో రిజ్వాన్, షకీల్ ఉండగా.. మాజీ కెప్టెన్ బాబర్ అజామ్(0), కెప్టెన్ షాన్ మసూద్(6) నిరాశపరిచారు. బంగ్లాదేశ్ బౌలర్లు షోరిఫుల్ ఇస్లామ్, హసన్ మహ్మద్‌కు రెండేసి వికెట్లు దక్కాయి. పాకిస్తాన్‌తో రెండు టెస్ట్ మ్యాచ్‌ల సిరీస్ ఆడేందుకు బంగ్లాదేశ్ ఈ పర్యటనకు వచ్చింది.

# టైటిల్ విజేతలు సిన్నర్, సబలెంక



బలగం టీవీ , న్యూయార్క్

టాప్‌సీడ్ టెన్నిస్ ఆటగాడు, ఇటలీకి చెందిన జెన్నిక్ సిన్నర్‌కు ఊరట లభించింది. నిషేధిత ఉత్ప్రేరకాలను తీసుకోవడంతో రెండుసార్లు పాజిటివ్ వచ్చిన సిన్నర్‌కు తాజాగా అంతర్జాతీయ టెన్నిస్ ఇంటిగ్రిటీ ఏజెన్సీ(ఐటిఐఏ) క్లీన్‌చిట్ ఇస్తున్నట్లు తాజాగా ప్రకటించింది. 2024 ఇండియన్ వెల్స్ మాస్టర్స్ టోర్నీ శాంపిల్స్‌లో తక్కువస్థాయిలో క్లోస్టెబోల్ మెటాబోలైట్ ఉన్నట్లు తేలింది. చిన్న గాయానికి మందు రావడం కారణంగా ఇలా జరిగిందని పరీక్షల్లో తేలింది. ఇక రెండోసార్లు డోప్ పరీక్షలకు ఉల్లంఘనలకు పాల్పడ్డాడు. ఈ క్రమంలో ఐటిఐఏ బుధవారం సమావేశమై స్పోర్ట్స్ నిబంధనలను అతడు అతిక్రమించలేదని, స్వతంత్ర ట్రిబ్యునల్ తీర్పునిచ్చింది. దీంతో అతడు వచ్చే వారం నుంచి ప్రారంభమయ్యే యుఎస్ ఓపెన్ గ్రాండ్‌స్లామ్ టోర్నమెంట్‌లో బరిలో దిగేందుకు దారి సుగమమైంది. సిన్సినాటి ఓపెన్ ఫైనల్లో సిన్నర్ 7-6(7-4), 6-2తో స్థానిక ఆటగాడు టఫీని ఓడించి టైటిల్‌ను చేజిక్కించుకున్నాడు. ఇక మహిళల సింగిల్స్ టైటిల్ 3వ సీడ్, బెలారస్‌కు చెందిన సబలెంక కైవసం చేసుకుంది. ఫైనల్లో సబలెంక 6-3, 7-5తో 6వ సీడ్, అమెరికాకు చెందిన పెగూలాను ఓడించింది.

# ఐసీసీ చైర్మెన్ రేసులో జైషా



**బలగం టీవీ, హైదరాబాద్**

అంతర్జాతీయ క్రికెట్ కౌన్సిల్ (ఐసీసీ) ఛైర్మన్ పదవి రేసులో భారత క్రికెట్ నియంత్రణ మండలి(బీసీసీఐ) సెక్రటరీ జై షా ఉన్నట్టు తెలుస్తోంది.

ఐసీసీ ప్రస్తుత చైర్మెన్ గ్రెగ్ బార్క్లే పదవీకాలం నవంబర్ 30తో ముగుస్తుంది. మరోసారి ఎన్నికల బరిలో నిలవకూడదని అతను నిర్ణయించుకోవడంతో జై షా పోటీ పడుతారనే చర్చ జోరుగా సాగుతుంది. అయితే ఈ వ్యవహారంపై ఆగస్ట్ 27న స్పష్టత రానుంది. ఐసీసీ ఛైర్మన్ పోస్ట్ కోసం నామినేషన్లు వేసేందుకు అది ఆఖరి రోజు. రూల్స్ ప్రకారం పర్యాయానికి రెండేళ్ల చొప్పున ఎవరైనా ఐసీసీ ఛైర్మన్‌గా మూడు పర్యాయాలు ఉండొచ్చు. న్యూజిలాండ్‌కు చెందిన బార్క్లే ఇప్పటికే నాలుగేళ్లు పూర్తి చేశాడు. మూడో సారి ఛైర్మన్ పదవికి పోటీ చేయనని బార్క్లే చెప్పాడని ఐసీసీ ప్రకటించింది.

బార్క్లే 2020 నవంబర్‌లో ఛైర్మన్‌గా బాధ్యతలు స్వీకరించగా.. 2022లో తిరిగి ఎన్నికయ్యాడు. ఐసీసీ ఛైర్మన్ ఎన్నికల్లో మొత్తం 16 ఓట్లు ఉండగా.. 9 ఓట్లు లభించిన వ్యక్తి గెలుస్తాడు. జై షా ప్రస్తుతం ఐసీసీ ఆర్థిక, వాణిజ్య వ్యవహారాల ఉప సంఘం అధిపతిగా ఉన్నారు. ఓటు హక్కు ఉన్న చాలా దేశాలు జై షా పట్ల సానుకూలతతో ఉన్నాయి.

ఇక బీసీసీఐ కార్యదర్శిగా జై షాకు మరో ఏడాది పదవీ కాలం ఉంది. ఆ తర్వాత అతను రూల్స్ ప్రకారం మూడేళ్లు తప్పనిసరి విరామం తీసుకోవాలి. బీసీసీఐలో ఎలాంటి పదవుల్లో కొనసాగకూడదు. ఈ క్రమంలోనే ఐసీసీ ఛైర్మన్ పదవి చేపట్టాలని జైషా భావిస్తున్నట్లు తెలుస్తోంది. ఐసీసీ ఛైర్మన్‌గా జై షా ఎన్నికైతే.. ఈ పదవి చేపట్టిన అతి పిన్నవయస్కుడిగా ఆయన రికార్డుకెక్కనున్నారు. అంతేకాకుండా ఐసీసీ ఛైర్మన్‌గా ఎంపికైన ఐదో భారతీయుడిగా నిలవనున్నారు. జగన్‌మోహన్ దాల్మియా, శరద్ పవార్, ఎన్ శ్రీనివాసన్, శశాంక్ మనోహర్‌లు భారత్ నుంచి ఐసీసీ ఛైర్మన్‌గా ఎన్నికయ్యారు.

# వెనిజులా సైక్లిస్ట్ అనుమానస్పద మృతి

**బలగం టీవీ,లాస్ ఏంజిల్స్**



వెనిజులా దేశానికి చెందిన మేటి సైక్లిస్ట్ డానిలా లార్రియల్ చిరినోస్ లాస్ వెగాస్‌లోని తన అపార్ట్‌మెంట్‌లో అనుమానాస్పద రీతిలో మృతిచెందారు. ఆగస్టు 16న ఆమె మృతదేహాన్ని గుర్తించారు. లాస్ వెగాస్‌లో హెూటల్‌లో పనిచేస్తున్న ఆమె.. పనికి రాకపోవడంతో ఆమె కోసం వెతికగా విషయం వెలుగులోకి వచ్చింది. ఆగస్టు 11వ తేదీన చిరినోస్ మృతిచెంది ఉంటుందని అంచనా వేస్తున్నారు. ఆమె గొంతులో ఘన ఆహార పదార్థాలను గుర్తించారు. వాటి వల్ల ఆమెకు శ్వాస ఆడి ఉండదని భావిస్తున్నారు.

ఒకప్పుడు వెనిజులా మేటి అథ్లెట్‌గా చిరినోస్‌కు గుర్తింపు ఉన్నది. ఆమె ఆ దేశం తరపున ఏకంగా అయిదు ఒలింపిక్స్‌లో ప్రాతినిధ్యం వహించింది. 1992 నుంచి 2012 వరకు సైక్లిస్ట్‌గా ఆమె మెగా క్రీడల్లో పాల్గొన్నది. 1992లో బార్సిలోనా, 1996లో అట్లాంటా, 2000లో సిడ్నీ, 2004లో ఏథెన్స్, 2012లో లండన్ గేమ్స్‌లో ఆమె ప్రాతినిధ్యం వహించింది. తన కెరీర్‌లో ఎన్నో పతకాలు గెలుచుకున్నదామె. 2002లో సెంట్రల్ అమెరికన్, కరీబియన్ గేమ్స్‌లో రెండు గోల్డ్ మెడల్స్ సాధించింది. 2003 పాన్ అమెరికన్ గేమ్స్‌లో రెండు సిల్వర్ మెడల్స్ గెలుచుకున్నది. సైక్లింగ్ లోకంలో ఆమెకు ప్రత్యేక గుర్తింపు ఉన్నది. ఇదిలా ఉండగా వెనిజులా రాజకీయాలను మాజీ అథ్లెట్ తీవ్రంగా విమర్శించేది. హ్యూగో ఛావేజ్ అంటే ఆమెకు నచ్చదు. ఫేక్ రేసింగ్ డ్రైవర స్పాన్సర్‌షిప్‌తో ఛావేజ్ నిధుల్ని దుర్వినియోగం చేసినట్లు ఆమె ఆరోపించింది. 2013లో నికోలస్ మాడురో బాధ్యతలు స్వీకరించడాన్ని కూడా ఆమె వ్యతిరేకించింది. దీంతో చిరినోస్‌పై వెనిజులాలో ఎంట్రీ బ్యాన్ విధించారు. మియామీలో ఊబర్ డ్రైవర్‌గా చేసింది. ఆ తర్వాత వెగాస్‌లో ఫుడ్ సర్వర్‌గా చేసింది.

# ప్రపంచ అత్యుత్తమ బౌలర్ బుమ్రానే : రికీ పాంటింగ్





**బలగం టీవీ,లాస్ ఏంజిల్స్**

టీమిండియా స్టార్ ఫాస్ట్ బౌలర్ జస్‌ప్రీత్ బుమ్రాపై ఆస్ట్రేలియా దిగ్గజ క్రికెటర్ రికీ పాంటింగ్ ప్రశంసల జల్లు కురిపించాడు. ఏడాదికి ఏడాది బుమ్రా మరింత మెరుగవ్వుతున్నాడని కొనియాడారు. అతని గొప్పతనం గురించి తెలుసుకోవాలంటే ప్రత్యర్థి బ్యాటర్లను అడిగితే సరిపోతుందని అన్నాడు. ప్రస్తుత ప్రపంచ క్రికెట్‌లో మల్టీ ఫార్మాట్ అత్యుత్తమ బౌలర్ బుమ్రా అని కితాబిచ్చాడు.టీ20 వరల్డ్ కప్ ఫైనల్ అనంతరం విశ్రాంతి తీసుకున్న బుమ్రా.. వచ్చే నెలలో జరిగే బంగ్లాదేశ్ టెస్టు సిరీస్‌కు తిరిగి అందుబాటులో రానున్నాడు. టీ20 కప్ విజేతగా భారత్ నిలవడంలో బుమ్రాది కీలకపాత్ర. ప్రత్యర్థి పైచేయి సాధిస్తున్న ప్రతి సందర్భంలో బుమ్రా రంగంలోకి దిగి టీమిండియాను తిరిగి పోటీలోకి తెచ్చాడు. ప్లేయర్ ఆఫ్ ది టోర్నమెంట్ అవార్డు అందుకున్నాడు. ఎంతో విలువైన బుమ్రా.. పనిభారంగా గాయాలపాలవ్వకుండా బీసీసీఐ ఎంతో జాగ్రత్త తీసుకుంటుంది. ఈ నేపథ్యంలో ఎక్కువగా విశ్రాంతి ఇస్తుంది.

అయితే గాయాల తర్వాత గత పునరాగమనంలో బుమ్రా మరింత మెరుగ్గా వచ్చిన సందర్భాలను పాంటింగ్ గుర్తు చేశాడు. ఇతర ఆటగాళ్ల విషయాల్లో తమ లయను తిరిగి అందుకుంటారా అనే సందేహాలు ఉంటాయని, కానీ బుమ్రా విషయంలో ఉండవని తెలిపాడు. “గత కొన్నేళ్లలో గాయాల గురించి భయాలు ఉండేవి. రీఎంట్రీలో పూర్వపు లయను అందుకుంటాడా లేదా? అని. కానీ బుమ్రా కమ్‌బ్యాక్ గొప్పగా ఉంది. గతంలో కూడా చాలా సార్లు చెప్పాను. గత అయిదు ఆరేళ్లుగా ప్రపంచ అత్యుత్తమ మల్టీ ఫార్మాట్ బౌలర్ బుమ్రానే”

“టీ20 వరల్డ్ కప్‌లో అతనే ఏం సాధించాడో చూశాం. పేస్, నైపుణ్యం అలానే ఉంది. కచ్చితత్వంలోనూ ఎలాంటి మార్పు లేదు. ఏడాదికి ఏడాది మరింత మెరుగువుతున్నాడు. బుమ్రాలా నైపుణ్యాల, నిలకడ ఉంటే మీరు కూడా అత్యుత్తమ ప్లేయర్లు అవుతారు. బుమ్రా గురించి తెలుసుకోవాలంటే ప్రత్యర్థి బ్యాటర్లను అడిగితే సరిపోతుంది. ‘బుమ్రా ఓ పీడకల. ఎలాంటి బంతులు సంధిస్తాడో చెప్పలేం’ అంటుంటారు. స్వింగ్, పేస్, ఇన్ స్వింగర్, ఔట్ స్వింగర్‌తో గొప్పగా బంతులు వేస్తాడు.గ్లెన్ మెక్‌గ్రాత్, జేమ్స్ అండర్సన్‌లా చరిత్రలో బుమ్రా మిగిలిపోతాడు” అని రికీ పాంటింగ్ పేర్కొన్నాడు.

# పారాలింపిక్స్‌లో మా లక్ష్యం 8 స్వర్ణాలు

- **చెఫ్ డి మిషన్ సత్యప్రకాశ్**

**బలగం టీవీ, హైదరాబాద్**



పారాలింపిక్స్‌లో కనీసం 8 స్వర్ణాలు నెగ్గడమే లక్ష్యంగా పెట్టుకున్నట్టు భారత పారాలింపిక్స్ కమిటీ (పీసీఐ) ఉపాధ్యక్షుడు సత్య ప్రకాశ్ సంఘ్వాన్ వెల్లడించారు. పారిస్ క్రీడల్లో ఆయనే భారత ‘చెఫ్ డి మిషన్’గా వ్యవహరిం చనున్నారు. టీమ్‌ఇండియా నుంచి అత్యధికంగా 84 మంది అథ్లెట్లు.. 12 క్రీడాంశాల్లో బరిలోకి దిగుతున్నారు. పారాలింపిక్స్ ఈనెల 28న ఆరం భమై.. సెప్టెంబరు 8న ముగుస్తాయి. ఈ సందర్భంగా సత్యప్రకాశ్ ఓ వెబ్‌సైట్‌తో మాట్లా డారు. తనకు దక్కిన అరుదైన ఘనతగా పేర్కొన్నారు.

“పారిస్ పారాలింపిక్స్‌కు భారత్ చెఫ్ డి మిషన్‌గా నియమించడం ఆనందంగా ఉంది. జీవితంలో గుర్తుండిపోయే వాటిల్లో ఇదొకటి. మరింత బాధ్యతతో నాకిచ్చిన విధులను నిర్వర్తిస్తా. నాపై నమ్మకం ఉంచినందుకు కేంద్ర ప్రభుత్వానికి, భారత పారాలింపిక్స్ కమిటీకి ధన్యవాదాలు. ఈసారి గేమ్స్‌లో కనీసం 25 నుంచి 30 పతకాలు సాధిస్తామని భావిస్తు న్నాం. అందులో కనీసం 8 స్వర్ణాలు దక్కించుకోవడమే మా లక్ష్యం. అథ్లెట్లు చాలా అద్భుతంగా సన్నద్ధమయ్యారు. అంతర్జాతీయ వేదికపై భారత్ సగర్వంగా నిలబడేలా చేస్తారు. ట్రైనింగ్ కోసం క్రీడాకారులను విదేశాలకూ పంపించాం. దేశమంతా క్యాంప్‌లు నిర్వహిం చాం. పీసీఐ ప్రధాన కోచ్ సత్యనారాయణ అద్భుతమైన మౌలిక సదుపాయాలు, పరికరాలు సమకూర్చడంలో కీలక పాత్ర పోషించారు. చెఫ్ డి మిషన్‌గా పారిస్‌లో నేను అథ్లెట్లకు మెరుగైన వసతులు కల్పించేందుకు కృషి చేస్తా. ఎలాంటి అవసరం వచ్చినా ముందుంటా” అని సత్యప్రకాశ్ వెల్లడించారు. టోక్యో వేదికగా జరిగిన గత పారాలింపిక్స్‌లో భారత అథ్లెట్లు 19 పతకాలు సాధించారు.

# క్లైమాక్స్ షూట్‌ను కూడా వదిలేసి వచ్చా : అల్లు అర్జున్





**బలగం టీవీ, హైదరాబాద్**

రావు రమేశ్ ప్రధాన పాత్రలో దర్శకుడు లక్ష్మణ్ కార్య తెరకెక్కించిన చిత్రం ‘మారుతీ నగర్ సుబ్రహ్మణ్యం’. ఇంద్రజ, అంకిత్, రమ్య పసుపులేటి కీలక పాత్రలు పోషించారు. దర్శకుడు సుకుమార్ సతీమణి తబిత సమర్పణలో ఈ నెల 23న సినిమా విడుదల కానుంది. హైదరాబాద్‌లో బుధవారం నిర్వహించిన ప్రీ రిలీజ్ ఈవెంట్‌కు అల్లు అర్జున్ , సుకుమార్ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు.

ఈ సందర్భంగా అల్లు అర్జున్ మాట్లాడుతూ “నా ఫ్యాన్స్.. నా ఆర్మీ.. లవ్ యూ.. నా ఫ్యాన్స్ అంటే నాకు పిచ్చి అందరూ హీరో ను చూసి ఫ్యాన్స్ అవుతే.. నేను ఫ్యాషన్ చూసి హీరో అయ్యా. ఇక ఈ ఈవెంట్ కు రావడానికి కారణం సుకుమార్ వైఫ్ తబిత ఈ సినిమాను ప్రొడ్యూస్ చేయడమే. నేను షూటింగ్ లో ఉన్న సమయంలో తబిత వచ్చి.. నేను సినిమా ప్రొడ్యూస్ చేస్తున్నా.. సుకుమార్ ఎలాగో వస్తారు. నేను మిమ్మల్ని కాకుండా ఇంకెవరిని అడుగుతాను అని అన్నారు. ఇక ఆ మాట తరువాత మాటలు లేవు.. మాట్లాడుకోవడాలు లేవు. ఆవిడ అలా అన్న వెంటనే.. డిఫికల్ట్ క్లైమాక్స్ షూట్‌ను కూడా వదిలేసి వస్తున్నాను అని చెప్పాను. ఎందుకంటే ఇష్టమైనవాళ్లకు మనం చూపించాలి. మన ఫ్రెండ్ అనుకో.. మనకు కావాల్సిన వాళ్ళు అనుకో.. నాకు ఇష్టమైతే నేను వస్తా. నా మనసుకు నచ్చితే నేను వస్తా. అది మీ అందరికి తెల్సిందే. సుకుమార్ పాన్ ఇండియా రేంజ్ లో ఉన్నా కూడా తబిత.. ఇలా ఒక సినిమా చేయడం అనేది చాలా గ్రేట్.చిత్ర బృందం మొత్తానికి ఆల్ ది బెస్ట్. సినిమాలో ఎంతమంది పని చేసినా.. హిట్ ఇచ్చేది డైరెక్టరే. ఆయనకు ఆల్ ది బెస్ట్. రావు రమేష్ నాకు ఇష్టమైన నటుడు. వేదంలో ఒక్క చిన్న క్యారెక్టర్ లో చేశారు. ఎవరు ఆయన.. చాలా బాగా చేశారు అని అడిగితే.. రావు గోపాల్ రావు కొడుకు అని చెప్పారు. నేను షాక్ అయ్యాను. మా తాతగారు, రావు గోపాల్ రావు గారు మా ఇంట్లో ఎప్పుడు కలుస్తూ ఉండేవారు. ఇక అప్పటినుంచి రావు రమేష్ గారి మీద గౌరవం పెరి గింది . అప్పుడే ఆయనతో చెప్పా .. మీరు ఏలుతారు అని.. ఇప్పుడు ఈ స్థాయికి రావడం చాలా ఆనందంగా ఉంది.

థియేటర్స్ ఇప్పుడు చాలా ఇబ్బందికరమైన పరిస్థితిలో ఉన్నాయి. మంచి మంచి సినిమాలు వస్తున్నాయి. అది చాలా సంతోషం. చిన్న సినిమాలు కూడా మంచి హిట్ అవుతున్నాయి. ఈ సినిమా కూడా విజయం అందుకోవాలని కోరుకుంటున్నాను. నేషనల్ అవార్డ్స్ వచ్చినవారందరికి శుభాకాంక్షలు. నాకు అవార్డు వవచ్చినప్పుడు కాంతారకు వస్తే బావుండు అనుకున్నాను. నిజంగా రిషబ్ శెట్టికి అవార్డు రావడం మంచి విషయం. సభాముఖంగా ఆయనకు శుభాకాంక్షలు తెలుపుతున్నాను.నేను ఏ సినిమా గురించి చెప్పాలన్నా భయపడతాను. సినిమా ఏంటి.. ? ఎలా ఉంది.. ? అనేది ప్రేక్షకులు చెప్పాల్సిన విషయం. నేను చెప్తే డబ్బా కొట్టినట్లు ఉంటుంది. కానీ, పుష్ప 2 సినిమా వస్తున్న విధానం.. మీ అందరికి నచ్చుతుంది. డిసెంబర్ 6 న అస్సలు తగ్గేదేలే. నా బంగారం.. ఈ సినిమా మాత్రం మీకు అంకితం. ” అని అన్నారు.




# ‘అహెూ! విక్రమార్క’ ట్రైలర్ విడుదల

**బలగం టీవీ, హైదరాబాద్**

‘మగధీర’లో విలన్‌గా నటించి, ప్రేక్షకులను ఆకట్టుకున్న నటుడు దేవ్‌గిల్ హీరోగా పేట త్రికోటి తెరకెక్కిస్తున్న చిత్రం ‘అహెూ! విక్రమార్క’. ఆగస్టు 30న ఇది విడుదల కానుంది. ఈ నేపథ్యంలోనే చిత్రబృందం ట్రైలర్‌ను విడుదల చేసింది. ఇందులో దేవ్‌గిల్ పవర్‌ఫుల్ పోలీస్ ఆఫీసర్‌గా కనిపించారు.

# ‘సరిపోదా శనివారం’ ప్రీ రిలీజ్ ఈవెంట్ డేట్ ఫిక్స్

**బలగం టీవీ, హైదరాబాద్**

వివేక్ ఆత్రేయ దర్శకత్వం వహిస్తున్న ‘సరిపోదా శనివారం’ మూవీ ప్రీ రిలీజ్ ఈవెంట్ అప్‌డేట్ రానే వచ్చింది. ఈవెంట్‌ను ఆగస్టు 24న గ్రాండ్‌గా నిర్వహించనున్నారు. ఆఫీసులో నాని.. కానిస్టేబుల్‌గా డ్యూటీలో ప్రియాంకా మోహన్ చాట్‌లో ఉన్న స్టిల్స్ రిలీజ్ చేశారు